RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

తెలంగాణ తల్లి

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18 వ వసంతంలోకి

ఎడిటర్ : బూర్ల వెంకన్న కరీంనగర్ సంపుటి :17 సంచిక :337 శనివారం , ఏప్రిల్ 4, 2026, పేజీలు -20 వెల :5/-

## టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ అగ్రగామి

### ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో సింఎం రేవంత్

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారింది.

- మిగతా2లో



## బిఆర్ఎస్‌లో ఇంటి గొడవలు

### టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్



**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** తెలంగాణ రాజకీయాల పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోయిందని, బీజేపీకి రాష్ట్రంలో స్థానం లేదని ఆయన అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో కాంగ్రెస్ నేతలతో భేటీ అయిన ఆయన.. ఈ మేరకు ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని రకాల కుట్రలు పన్నినా.. కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉంది. అందుకు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు.

- మిగతా2లో

## యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీ పై వేటు



**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీని ఆ పదవి నుండి ట్రంప్ యంత్రాంగం గురువారం తొలగించినట్లు వైట్‌హౌస్ తెలిపింది. అంతర్జాతీయంగా వివాదాస్పదమైన లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు సంబందించిన దర్యాప్తు పత్రాల నిర్వహణ సహా పలు అంశాలపై ట్రంప్ అసహనం వ్యక్తం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా తాను దర్యాప్తు ఎదుర్కోవాలని కోరుకున్న విమర్శకులు, ప్రత్యర్థులపై అభియోగాలు మోపడంలో బోండీ తగిన విధంగా వ్యవహరించకపోవడం ట్రంప్‌ను తీవ్ర అసహనానికి గురిచేసినట్లు తెలిపాయి.

- మిగతా2లో

## స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** రాష్ట్రంలో స్కూల్ ఫీజుల గొడవ నడుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 39,640 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. సీబీఎస్సీ సెంట్రల్ సిలబస్ ఉన్న స్కూల్స్‌లో 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచి ఇప్పటినుంచే వసూలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఫీజు నియంత్రణ చట్టం చేయాలని రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడారని గుర్తుచేశారు. ఎవరెంత తిన్నారంటూ అసెంబ్లీలో చర్చ చేసుకున్నారే తప్ప ఫీజుల నియంత్రణ పై


- మిగతా2లో



## మరో మూడు రోజులు పార్లమెంట్

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లు, ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లు వంటి ముఖ్యమైన బిల్లులను ఆమోదింప జేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలను పొడిగించేందుకు ప్రయత్నిస్తోంది. గురువారం బడ్జెట్ సమావేశాల రెండో దశ ముగిసిన తరువాత పార్లమెంట్

- మిగతా2లో



## కల్తీ మామిడి పండ్లతో జాగ్రత్త



**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** మామిడిపండ్ల సీజన్ ప్రారంభం అయ్యింది. నగరంలో నోరూరించే పళ్లు కనిపిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు వ్యక్తులు కల్తీ మామిడి విక్రయాలకు పాల్పడటం ఆందోళనకు గురిచేసే విషయం. మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్ రసాయనాలతో కృత్రిమంగా

- మిగతా2లో

## మరోమారు నోరు పారేసుకున్న ఖవాజా

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం దాడి జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ తమ పై బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇవన్నీ చూస్తుంటే వారు తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తూ.

- మిగతా2లో




## రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం



**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చడ్డాను ఆ పదవి నుంచి ఆప్ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై ఆప్ ఎంపీ రాఘవ్ చడ్డా తాజాగా స్పందించారు. తానేం తప్పు చేశానంటూ పార్టీని బహిరంగంగా ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన గళాన్ని అణచివేయగలరేమో గానీ తనను ఓడించలేరంటూ ఓ వీడియో

- మిగతా2లో

## కేరళలో రేవంత్ రెడ్డి ప్రచారం..

### విమర్శలు గుప్పించిన కిషన్ రెడ్డి



**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** ఆరు గ్యారెంటీల విషయం లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారం సందర్భంగా గొప్పలు పలికారని, మున్ముందు తెలంగాణలోనూ ఇదే తరహా మాటలు చెప్పే ప్రమాదం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఇటీవల రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారంలో

- మిగతా2లో

## రేవంత్ పాలన పై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి..

**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన ప్రారంభమై రెండేళ్లు కాకముందే "ఈ ప్రభుత్వం పోవాలి.. మార్పు రావాలి" అనే పరిస్థితి ఏర్పడిందని జీవన్ రెడ్డి విమర్శించారు. గతంలో కేసీఆర్ పాలనపై వ్యతిరేకతతోనే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారని, కానీ ఇప్పుడు అదే తరహా అసంతృప్తి రేవంత్ ప్రభుత్వం పై కనిపిస్తోందని

- మిగతా2లో



## గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు



**తెలంగాణ పత్రిక ప్రతినిధి :** గిరిజనులకు ఉన్న 6 శాతం రిజర్వేషన్‌ని 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనతా ఆయనకే దక్కుతుందన్నారు. నారాయణ పేట జిల్లా మద్దూరు మండలం బావోజీ జాతరకు మాజీ మంత్రులు హరీశ్ రావు, శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు.

- మిగతా2లో

## యుఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండీ పై వేటు

-మొదటిపేజీ తరువాయి

పామ్ బోండీ పదవి నుండి తొలగింపబడిన రెండవ సీనియర్ అధికారి. మార్చి 5న హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టీ నోమ్‌ను ట్రంప్ పదవి నుండి తొలగించిన సంగతి తెలిసిందే. ఆ శాఖ నిర్వహణ తీరుపైనా, ట్రంప్ వలసవిధాన అజెండాపై వచ్చిన తీవ్ర విమర్శలతో క్రిస్టీ నోమ్‌ను పదవి నుండి తొలగించారు. యుఎస్ అటార్నీ జనరల్‌గా బోండీ తన పదవీ కాలంలో ట్రంప్ అజెండాకు గట్టి మద్దతుదారుగా నిలిచారు. న్యాయశాఖ తన దర్యాప్తులో వైట్‌హౌస్ నుండి స్వతంత్రంగా వ్యవహరించే సుదీర్ఘ సాంప్రదాయాన్ని ఇది నాశనం చేసింది. ట్రంప్ మిత్రులు, కొంతమంది రిపబ్లికన్ చట్టసభ్యులు సహా ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై వచ్చిన విమర్శలు ఆమెను చుట్టుముట్టాయి. పలు రాజకీయ శక్తులు, కార్పొరేట్ అధిపతులు, ఆర్థిక సంస్థలు, పలుకుబడి కలిగిన వ్యక్తులు, కుబేరులతో ఎప్‌స్టీన్ సంబంధాలను అమెరికా న్యాయవ్యవస్థ డోజ్ జరిపిన దర్యాప్తు రికార్డులు వెల్లడికాకుండా అడ్డుకున్నారని, దుర్వినియోగం చేశారని ఆమెపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఈ అంశం ట్రంప్‌కు రాజకీయంగా తలనొప్పులు సృష్టించడంతో పాటు దశాబ్దాల క్రితం ముగిసిపోయిందని ఆయన ప్రకటించిన ఎప్‌స్టీన్‌తో సంబంధం పై తిరిగి నిశిత దర్యాప్తు చేపట్టేలా చేసింది. అయితే ఆమె తొలగింపు న్యాయశాఖలో భారీ మార్పులకు దారితీయవచ్చని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకున్న వారిపై డోజ్‌ను ప్రయోగించే దిశగా నూతన యత్నాలు చేపట్టవచ్చని పేర్కొన్నారు.

## టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ అగ్రగామి

-మొదటిపేజీ తరువాయి

చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం. పర్యావరణ పరిరక్షణెళి మా తొలి ప్రాధాన్యం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన టెక్స్‌టైల్ రంగ ప్రముఖులకు స్వాగతం పలుకుతూ, తెలంగాణను ప్రపంచ వస్త్ర రంగ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వ దార్శనికతను పంచుకున్నారు.తెలంగాణకు వస్త్ర రంగంతో ఉన్న చారిత్రక అనుబంధాన్ని గుర్తుచేశారు. భారతదేశానికి అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర ఉంది. తెలంగాణ గర్వంగా చెబుతోంది.. టెక్స్‌టైల్ మన డిఎన్ఎలోనే ఉంది. నిజాం కాలంలోనే ప్రపంచ నలుమూలల నుండి వ్యాపారులు హైదరాబాద్ కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారు అని ఆయన పేర్కొన్నారు. కేవలం పరిశ్రమగానే కాకుండా, ఇది లక్షలాది మందికి జీవనాధారమని.. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్ వంటివి మన సంస్కృతికి ప్రతీకలని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047' గురించి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వివరిస్తూ, 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యం అని పేర్కొన్నారు. ఇంకా 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా మార్చడమే మా సంకల్పం అని అన్నారు. అలాగే వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, పత్తి ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా పెట్టుబడిదారులకు ఆయన పిలుపునిస్తూ.. 'మీకు విజన్ ఉంటే, మేము మీకు సరైన భాగస్వాములం. మౌలిక సదుపాయాలు, భూమి, విద్యుత్, నీరు, వేగవంతమైన అనుమతులతో పాటు ప్రపంచ స్థాయి విధానాలను మా ప్రభుత్వం అందిస్తుంని అంటూ హామీ ఇచ్చారు. డీప్ టెక్, ఫార్మా, ఏరోస్పేస్ వంటి రంగాల్లో ఇప్పటికే ముందంజలో ఉన్న తెలంగాణ, ఇప్పుడు టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్ ను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. మరోవైపు హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలను ప్రారంభించడాన్ని ఆయన ప్రస్తావించారు. టాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాక హాలీవుడ్ కూడా హైదరాబాద్ ను కేంద్రంగా చేసుకుంటున్న తరుణంలో సినిమా రంగానికి అవసరమైన ఫ్యాషన్ ను కూడా తెలంగాణ నుంచే అందించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ 'గ్రీన్ టెక్స్‌టైల్ హబ్' లను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.

## స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

-మొదటిపేజీ తరువాయి

ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తేవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల న్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఫీజులను పెంచుతున్నాయే తప్ప టీచర్లకు మాత్రం జీతాలు పెంచరని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీల్లో ఆహార నాణ్యతను ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలు, ఆసుపత్రులను సీఎం ప్రారంభిస్తున్నారని... వాళ్ళ దోపిడిని ఎంకరేజ్ చేస్తున్నారా అంటూ నిలదీశారు. ప్రైవేట్ స్కూల్స్ దోపిడీని కంట్రోల్ చేయాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే స్కూల్స్ ముందు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. 'అన్ని శాఖలకు ముఖ్యమంత్రే మంత్రిగా ఉండటం మన కర్మ' అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో తనను నిజామాబాద్‌కు పరిమితం చేశారని అన్నారు. ఆంధ్రా, నార్త్ ఇండియా వాళ్ళు ఇక్కడ విద్యా సంస్థలు నెలకొల్పినా తెలంగాణ వాళ్ళకే అవకాశం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని.. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు.

## బిఆర్ఎస్‌లో ఇంటి గొడవలు

-మొదటిపేజీ తరువాయి

పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై.. కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఆయన అసెంబ్లీకి కూడా రావడం లేదు. ఇలాంటి పరిస్థితిలో బిఆర్ఎస్ రోజురోజుకు దిగజారుతోందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ.. దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడుగుతోంది. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు.. అందుకే ఆ పార్టీని దూరం పెడుతున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో 100 సీట్లు ఖాయం' అని అన్నారు. బీజేపీ కులం, మతం పేరుతో రాజకీయాం చేస్తోందని..ఆ పార్టీకి తెలంగాణలో స్థానం లేదని విమర్శించారు. రాముడేమైనా బీజేపీ జాగీరా....వాళ్ల పార్టీల సభ్యత్వం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేనట్టుగా తెలంగాణలో ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. సన్నబియ్యం పథకం దేశంలోనే చారిత్రాత్మకమన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు కాంగ్రెస్ కడుతోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో నేతల జేబుల్లోకి డబ్బులు వెళ్లాయన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు స్కీం సక్సెస్ గా నడుస్తోందన్నారు. బీజేపీ రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదన్నారు. కేంద్రం లాభాల్లో ఉన్న సంస్థలను అమ్మేస్తోందని విమర్శించారు. 12 ఏండ్లలో కేంద్రం ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు మహేశ్ కుమార్ గౌడ్. ఇందిగాంధీ నుంచి రాహుల్ వరకు పేదల కోసం పనిచేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ చీప్ కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారని అన్నారు. దోచుకున్న సొత్తులో వాటాల గొడవలతో ఆ పార్టీ రోడ్డున పడిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కు 100 సీట్లు గ్యారంటీ అని ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సమ్మిట్ తో 5 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయన్నారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని చెప్పారు మహేశ్ కుమార్ గౌడ్. ఈ కర్యాక్రమంలో మంత్రి వివేక్‌తో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.

## మరోమారు నోరు పారేసుకున్న ఖవాజా

-మొదటిపేజీ తరువాయి

మరోసారి తమతో ఘర్షణకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమపై జరిగే దాడులను వేగవంతమైన, ప్రణాళికాబద్ధమైన ప్రతిస్పందనతో తిప్పికొడతామన్నారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగుదేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పాక్‌ను హెచ్చరించారు. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్‌లను గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## మరో మూడు రోజులు పార్లమెంట్

-మొదటిపేజీ తరువాయి

అయితే, సభా కార్యకలాపాలు ముగిసిన తరువాత, ఈ నెల 16న ఉదయం 11 గంటల వరకు సభ వాయిదా పడుతుందని అధికారిక ప్రకటన వెలువడింది. లోక్‌సభ, శాసనసభలలో సీట్లను పెంచేందుకు, మహిళా రిజర్వేషన్లను అమలు చేసేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించేందుకే సమావేశాలను పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అదే సమయంలో విమర్శలు ఎదుర్కొంటున్న ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లును కూడా ఆమోదించితీరాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లుపై పార్లమెంట్ లోపల, వెలుపల భారీ నిరసనలు వెల్లువెత్తిన సంగతి విదితమే. కేరళం శాసనసభ ఎన్నికల ముందు ఈ బిల్లు ఆమోదం పొందితే బిజెపికి పెద్ద ఎదురుదెబ్బ తగులుతుందని కూడా కేంద్ర ప్రభుత్వం గ్రహించింది. కేరళలో ఎన్నికల తరువాత పార్లమెంట్ తిరిగి సమావేశమవుతుంది. ఈ పరిస్థితుల్లో, ప్రత్యేక సమావేశంలో ఎఫ్‌సిఆర్ఎ బిల్లును కూడా ఆమోదిస్తారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మహిళా రిజర్వేషన్లను అమలు చేయడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణలను ఎలా అమలు చేయాలన్న ప్రతిపక్షాల ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇంకా సమాధానం ఇవ్వలేదు. రాజ్యాంగ సవరణను ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపక్షాల మద్దతు కూడా అవసరం. అయితే, అఖిలపక్ష సమావేశం నిర్వహించడానికి గానీ, ప్రతిపక్షాల సందేహాలకు వివరణ ఇవ్వడానికి గానీ కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందన్న అనుమానం వ్యక్తమవుతోంది. లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య పెంపు, మహిళా రిజర్వేషన్ చట్టం సత్వర అమలు వంటి కీలక బిల్లుల కోసం మూడురోజుల పాటు సమావేశాలు కొనసాగే అవకాశాలున్నాయని, ఈ విషయాన్ని విపక్షాలకు ప్రభుత్వం తెలిపిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మహిళా రిజర్వేషన్ కోటా అమలు బిల్లుపై, జనగణనతో నియోజకవర్గాల పునర్విభజనకు ఉన్న లంకెను విడదీయడంపై విపక్షంతో ప్రభుత్వం లోపాయికారీ సంప్రదింపులు జరుపుతోందని తెలుస్తోంది. కేంద్ర సాయుధ పోలీసు దళాల (సీఏపీఎఫ్‌ల)కు ఒకే విధమైన ఉద్యోగ నిబంధనలు ఉండేందుకు ప్రతిపాదించిన బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభ ఆమోదించి పంపిన ఈ బిల్లును లోక్‌సభ కూడా మూజువాణి ఓటుతో ఆమోదించింది.

## కేరళలో రేవంత్ రెడ్డి ప్రచారం.. విమర్శలు గుప్పించిన కిషన్ రెడ్డి

-మొదటిపేజీ తరువాయి

ఈ నేపథ్యంలో కిషన్ రెడ్డి స్పందిస్తూ, కేరళ ఎన్నికల ప్రచారంలో బీజేపీపై ముఖ్యమంత్రి తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. కానీ రెండున్నరేళ్లు కావొస్తున్నా ఎన్ని హామీలు నెరవేర్చిందో చెప్పాలని నిలదీశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చి ఏం చేశారని రేవంత్ రెడ్డి కేరళకు వెళ్లి గొప్పలు చెప్పుకుంటున్నారని ప్రశ్నించారు. తెలంగాణ వచ్చాక పదేళ్ల పాటు కేసీఆర్ ప్రజలను మోసం చేస్తే, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే పని చేస్తున్నారని ఆరోపించారు. బీసీలకు ఏదో చేశామని కాంగ్రెస్ పార్టీ చెబుతోందని, అదేమిటో చెప్పాలని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు.

## రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

-మొదటిపేజీ తరువాయి

పార్లమెంట్‌లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా.. ప్రజా సమస్యలనే లేవనెత్తుతా. బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం ఏమైనా నేరమా అని నిలదీశారు. నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టుల్లో ఆహార ధరలు, గిగ్ వర్కర్ల సమస్యలు, టోల్ ప్లాజా దోపిడీ, టెలికాం కంపెనీల రీఛార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే.. అది ఆమ్‌ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా అని అన్నారు. మొన్నటికి మొన్న వివిధ రకాల పన్నులుపై నిలదీశారు. దీనివల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది? ఎందుకు నన్ను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు? ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయగలరు. కాని, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తా. నేను నది లాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకుపడతా అని రాఘవ్ చద్దా తన వీడియోలో పేర్కొన్నారు. రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా రాఘవ్ చడ్డాను తొలగించిన ఆప్.. ఆ హోదాలో మరో ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించింది. ఆప్ నిర్వహిస్తున్న కార్యకలాపాలకు చడ్డా దూరంగా ఉంటుండటం, పార్టీ కార్యక్రమాలపై స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాఘవ్ చడ్డా భాజపాలో చేరనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తోన్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశ మైంది.ఎంపి రాఘవ చద్దాని ఉపనాయకుడి పదవి నుంచి తొలగించాలని గురువారం రాజ్యసభ సచివాలయానికి ఆ పార్టీ లేఖ రాసింది. సభలో రాఘవ చద్దాని మాట్లాడనివ్వకూడదని కూడా ఆ లేఖలో ఆప్ పేర్కొంది. దీనిపై ఆప్ ఎంపి రాఘవ్‌చద్దా శుక్రవారం స్పందించారు. పార్లమెంటులో ప్రజా సమస్యలను లేవనెత్తడం నేరమా? నేను ఏదైనా తప్పు చేశానా? అని ఆప్‌ని ప్రశ్నించారు. ఈ మేరకు ఓ వీడియోను ఆయన శుక్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. నాకు ప్రజల మద్దతు ఉంది. నా మౌనాన్ని నా ఓటమిగా పొరపాటు పడకండి అని రాఘవ్ చద్దా వీడియోలో తెలిపారు.

## రేవంత్ పాలన పై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

-మొదటిపేజీ తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్టుపై కేవలం రాజకీయ విమర్శలే తప్ప, పునరుద్ధరణ పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని జీవన్ రెడ్డి మండిపడ్డారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల పునరుద్ధరణకు కేవలం రూ. 500 కోట్లు ఖర్చవుతాయని, కానీ ప్రభుత్వం ఎన్డీఎస్ఏ నివేదికను కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రాణహిత జలాల వినియోగంలో ప్రభుత్వం విఫలమైందని, బడ్జెట్‌లో కేవలం రూ. 152 కోట్లు కేటాయించడం నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని ధ్వజమెత్తారు. మేడిగడ్డ పునరుద్ధరణ చేపట్టకపోతే 18 లక్షల ఎకరాల సాగుభూమి ఎడారిగా మారుతుం దని, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. భవిష్యత్ రాజకీయ నిర్ణయాలపై స్పందిస్తూ, త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటానని జీవన్ రెడ్డి తెలిపారు. తనపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన మరో రెండు వారాల్లో ఏ పార్టీలో చేరబోతున్నానో అధికారికంగా ప్రకటిస్తానని స్పష్టం చేశారు.

## గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..'లోక్ మసంద్ మహారాజ్ జాతరకు రావడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంతానికి రూ.8 కోట్లతో బ్రిడ్జి వేయించింది మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి. ఈ దేవాలయ అభివృద్ధికి, గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ ఎంతో చేశారు. మా తండాలో మా రాజ్యం అంటే ఎవ్వరూ పట్టించుకోలేదు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌ది. అన్ని రంగాల్లో కేసీఆర్ వారికి రిజర్వేషన్లు తెచ్చారు. గిరిజనులకు ఇప్పుడు కాంగ్రెస్ చేసింది గుండు సున్నా. ఎస్సీ, ఎస్టీలకు డిక్లరేషన్ ఇచ్చి వారు చేసిందేమీ లేదు. రూ.2,730 కోట్లు ఎస్టీలకు బ్జడెట్‌లో పెట్టి కేవలం రూ.50 కోట్లే ఖర్చు చేశారు. గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.. ఒక్కరికీ ఇవ్వలేదు. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యకు దూరం చేస్తున్నారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్లు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కూడా ఇవ్వడం లేదని ఆక్షేపించారు. సంత్ సేవాలాల్ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు ప్రకటించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఎస్టీల ఓట్లు కావాలిగానీ, వాళ్ల సంక్షేమం పట్టించుకోరా?అని ప్రశ్నించారు. కేరళలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేశామని బడాయి మాటలు చెబుతున్నారని విమర్శించారు. మా లంబాడీలను దగా చేశారు. సీఎం రేవంత్, ఆయన మనుమడు ఫుట్ బాల్ ఆడేందుకు డబ్బులు ఉంటాయి కానీ ఎస్టీలకు ఇచ్చేందుకు లేవా?. లగచర్లలో లంబాడీల భూములు గుంజుకుని సీఎం రేవంత్ రెడ్డి వారిని జైలులో పెట్టారు. ఇక్కడ చేసింది చాలదని కేరళకు పోయి గొప్పలు చెబుతున్నారు. ఇంట్లో ఈగల మోత అంటే కేరళపోయి పల్లకీల మోత అన్నట్లు ఉంది. కొడంగల్ నియోజకవర్గంలో ఏ గ్రామంలో రుణమాఫీ వంద శాతం జరిగిందో రేవంత్ చూపించాలని సవాల్ చేశారు. నేను కొడంగల్ వచ్చినా గ్రామసభల్లో మీ నాయకులను జనం నిలదీస్తున్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేశారు. ప్యాకేజ్-3లో కొంత పని మాత్రమే మిగిలి ఉంది. త్వరగా ఆ పని పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరొస్తుందని చేయల్లేదు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. మీ నిర్లక్ష్యం వల్ల పాలమూరు ప్రజలకు అన్యాయం జరిగిందని అన్నారు.

## కల్తీ మామిడి పండ్లతో జాగ్రత్త

-మొదటిపేజీ తరువాయి

మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్ రసాయనాలతో కృత్రిమంగా పండించి విక్రయిస్తున్న వ్యాపారుల పట్ల జాగ్రత్త అవసరం. ఈ కల్తీ పండ్ల వల్ల ఆరోగ్య సమస్యలు రావడమే కాకుండా క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ విషయమై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ.సజ్జనార్ ఎక్స్ వేదికగా స్పందించారు. వేసవి కాలం రాకతో మామిడి మార్కెట్‌లో సందడి చేస్తోందని సజ్జనార్ అన్నారు. అయితే.. నోరూరించే ఈ ఫలాల మాటున ప్రాణాంతకమైన విషకోరలు దాగున్నాయన్న నిజాన్ని ప్రజల మరవకూడదని హెచ్చరిస్తూ.. 'కల్తీ మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త!' అని ఎక్స్ వేదికగా వివరించారు. మార్కెట్లలో ఎక్కడైనా కల్తీ మామిడి పండ్లను విక్రయించినా, ఆ సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100కి గానీ, హెచ్-ఫాస్ట్ ఫోన్ నంబర్ 8712661212కు కాల్ చేయాలని సజ్జనార్ సూచించారు.

# మాధపురం ఎంపీపీఎస్ లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

-కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా నిర్వహణ
-సమాజం దృష్టిని ఆకర్షించిన పాఠశాల
-మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ జి. కళావతి

దేవరుప్పుల, ఏప్రిల్ 4 (తెలంగాణ పత్రిక):





దేవరుప్పుల మండలంలోని మాధపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. హెడ్మాస్టర్ నల్ల లలిత కార్యక్రమానికి అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి గుంటిపల్లి కళావతి, దేవరుప్పుల ఎస్ఐ ఊర సృజన్ కుమార్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన సాంస్కతిక ప్రదర్శనలలో భాగంగా ఆర్మీ, సంప్రదాయ నాట్యం, తెలంగాణ పల్లె సాంస్కృతిక ప్రదర్శనలను ప్రతిబింబిస్తూ చిన్నారులు ముచ్చటైన వేషధారణలో అందరినీ అలరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంఈవో డా. జి. కళావతి మాట్లాడుతూ, మాధపురం ప్రాథమిక పాఠశాలకు మండలంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. ఇక్కడి హెచ్ ఎం నల్ల లలిత, ఇతర ఉపాధ్యాయుల కృషి వల్ల బోధనాభ్యసనలో గుణాత్మక మార్పు తీసుకు రాగలిగారన్నారు. అనునిత్యం పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజం దృష్టిని ఆకర్షించిందన్నారు. ముఖ్యంగా గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాల యొక్క ప్రాధాన్యతను గుర్తించి ప్రైవేటు లో చదువుతున్న 60 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారన్నారు. ఉపాధ్యాయ బృందంతో ఆమె పాటు ఆ తల్లిదండ్రులందరినీ అభినందించారు. ఉపాధ్యాయులు సమాజంతో సమన్వయం చెందుతూ అంకిత భావంతో పనిచేసిన చోట ప్రభుత్వ పాఠశాలలు ప్రకాశిస్తాయని, అందుకు మాధపురం ప్రాథమిక పాఠశాల నిదర్శనం అన్నారు. చిన్నారి బాలబాలికలకు పాఠశాల వార్షికోత్సవం ఒక మంచి జ్ఞాపకంగా నిలుస్తుందని,ఈనాటి ఈ చిన్నారులు సరైన విద్య ద్వారా రేపు గొప్ప స్థానాల్లో నిలబడతారని ఆశాభావం వ్యక్తం చేసారు. పాఠశాల అభివద్ధికి ఆర్థిక, హార్దిక తోడ్పాటునందిస్తున్న బిల్ల ఫౌండేషన్ బాధ్యుడు, ప్రధానోపాధ్యాయులురాలు ఎన్. లలిత భర్త బిల్ల రమేశ్ ను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలల్లో విద్యార్థుల చదువు కోసం తపనతో, నిబద్ధతగా పనిచేసే మహిళా ఉపాధ్యాయులలో సావిత్రీబాయి పూలే కనిపిస్తుందని పేర్కొన్నారు. ఎస్సై సృజన్ కుమార్ మాట్లాడుతూ మాధపురం పాఠశాల జిల్లాలో మంచి పేరు పొంది, అవార్డులు సాధించిందన్నారు. పాఠశాల హెడ్మాస్టర్ తోపాటు ఉపాధ్యాయులు చేస్తున్న సమిష్టి కృషిని ఆయన అభినందించారు. పిల్లలను బాగా చదివించాలని గ్రామస్థులకు సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను, డ్రగ్స్ రహిత సమాజం కోసం చేయాల్సిన కృషిని ఆయన ప్రజలకు వివరించారు. అనంతరం సర్పంచ్ పంజాల శ్రీధర్ మాట్లాడుతూ పాఠశాలకు పూర్వ వైభవం తీసుకొస్తున్న ఉపాధ్యాయుల కృషికి సార్ధకతగా త్వరలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డితో మాట్లాడతానన్నారు. ఆదనపు తరగతి గదులు, మౌలిక వసతులు మరింత మెరుగుపడేలా పాటుపడుతానన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎన్. లలిత మాట్లాడుతూ, పాఠశాలలో 'ఎఎక్స్ఎల్ ఎఐ' ద్వారా డిజిటల్ విద్యను అందిస్తున్నామని, స్పోకెన్ ఇంగ్లీష్, జికె, డ్రాయింగ్, రీడ్ ప్రోగ్రాం, యోగా, మెడిటేషన్, హెల్త్ ఎడ్యుకేషన్, సాంస్కతిక అంశాలు, లైఫ్ స్కిల్స్, క్రమశిక్షణ, వివిధ పండుగలు, ప్రత్యేక దినాలను శ్రద్ధతో నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం విద్య, సాంస్కృతిక, క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మాధాపురం, లాకావత్తండా(ఎం) సర్పంచ్లు పంజాల శ్రీధర్, భాగ్యనాయక్, దుబ్బతండా ఉపసర్పంచ్ యాకుబ్, స్కూల్ అభివృద్ధి ప్రదాత బిల్లా రమేష్, కోలుకొండ స్కూల్ కాంప్లెక్సు హెచ్ఎం వెంకన్న, పీఎస్హెచ్ఎం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బుర్ర రమేష్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మర్యాల రమేష్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రయ్య, శంకరయ్య, పీఆర్టియు మండల అధ్యక్షుడు గోలి తిరుపతిరెడ్డి, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో జనగణన పనులు సమగ్రంగా చేపట్టాలి

-కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఏప్రిల్,3





జిల్లాలో జాతీయ జనగణన కార్యక్రమాన్ని సమగ్రంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. జనగణన ప్రక్రియలో ప్రతి ఇంటిని కవర్ చేస్తూ, ఎలాంటి లోపాలు లేకుండా ఖచ్చితమైన డేటా సేకరణ జరగాలని ఆయన అన్నారు . జాతీయ జనగణన కార్యక్రమం భాగంగా ఏప్రిల్ 1 నుండి 3 వరకు జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ఫీల్డ్ ట్రైనర్స్కు మూడు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించబడగా, ఫీల్డ్ స్థాయిలో పని చేసే సిబ్బందికి అవసరమైన అన్ని అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్స్గా ఎన్. శివరామకృష్ణ, డాక్టర్ పి. సుస్మిత రజిని పాల్గొని, మొత్తం 34 మంది ఫీల్డ్ ట్రైనీస్కు జనగణన నిర్వహణ విధానం, హౌస్ సెన్సెస్, డేటా సేకరణలో పాటించాల్సిన జాగ్రత్తలు, డిజిటల్ పద్ధతుల వినియోగం తదితర అంశాలపై విపులంగా శిక్షణ అందించారు. శిక్షణలో భాగంగా మూడవ రోజు పాలకోయ తండా ప్రాంతంలో ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. ఫీల్డ్ ట్రైనీస్ను అవుట్ ఫీల్డ్కు తీసుకెళ్లి, ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరించే విధానాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మొదటి ఇంటిలో హౌస్ సెన్సెస్ కార్యక్రమాన్ని కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ సమక్షంలో నిర్వహించారు. ఈ డెమో ద్వారా ఫీల్డ్ ట్రైనీస్కు ప్రత్యక్ష అనుభవం లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణనలో సేకరించే సమాచారం ప్రభుత్వ విధానాల రూపకల్పనకు ఎంతో కీలకమని అన్నారు . అందువల్ల ప్రతి వివరాన్ని శ్రద్ధగా నమోదు చేయాలని, ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారికి అవసరమైన సమాచారం అందిస్తూ డేటా సేకరణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెన్సెస్ జిల్లా అధికార సిబ్బంది, సి.పి.ఓ. సంజీవరావు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణా కార్యక్రమం కొనసాగింది.

# ఇంటి వద్దనే గర్భిణికి సుఖ ప్రసవం చేసిన అంబులెన్స్ ఆపద్బాంధవులు

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది ఏప్రిల్ 03:





నవ మాసాలు మోసిన తల్లికి కడుపులో ఉన్న బిడ్డ,ఎప్పుడెప్పుడు బయటకు వస్తుందా , చూసి, ముద్దాడి మురిసిపోవాలని, ఎలాంటి ఆటంకమ లేకుండా ప్రసవం కావాలని ప్రతి తల్లి దండ్రులకు ఉంటుంది అలాంటి కలను నిజం చేసి ఇంటి వద్దనే సుఖ ప్రసవం చేసి ఆపద్బాంధవులు నిలిచారు అంబులెన్స్ సేవకులు.వివరాల్లోకి వెళితే ములుగు జిల్లా వాజేడు మండలం గుమ్మడి దొడ్డి గ్రామానికి చెందిన ఎట్టి శ్రీవిద్య 22 సంవత్సరాలు భర్త చంద్రశేఖర్ కి తొమ్మిది నెలలు నిండి రెండవ కానుపు పురిటి నొప్పులు రావడంతో అంబులెన్స్ 108 కి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఏటూరునాగారం అంబులెన్స్ సిబ్బంది అప్పటికే మరో కేసు ములుగు జిల్లా ఆసుపత్రిలో అడ్మిట్ చేసి తిరుగు ప్రయాణంలో ఉన్న సిబ్బంది హుటా హుటిన ఘటన స్థలానికి చేరుకొని గర్భిణీ స్త్రీ ఆరోగ్య పరిస్థిని పరీక్షించగా అప్పటికే ప్రసవ సూచనలు కనిపించడంతో ఈఏంటి చాక చక్యంగా వ్యవహరించి డెలివరీ కిట్, కావలసిన మందులు, సూదులు సిద్ధం చేసుకొని ఇంటి వద్దనే సుఖ ప్రసవం చెయ్యగా ఆరోగ్యవంతమైన మగ బిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ కదలికలు , ఏడుపు ఉండాల్సిన పరిస్థిలో ఉండగా ప్రసవం అనంతరం తల్లి, బిడ్డలకు కావాల్సిన చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి జరిగిన విషయాన్ని వైద్యులకు వివరించి అడ్మిట్ చెయ్యడం జరిగింది. పురిటి నొప్పులతో తల్లాడుతున్న గర్భిణీ పరిస్తితి చూసి ఆవేదన చెందిన కుటుంబంలో ఇంటి వద్దనే సుఖ ప్రసవం చేసిన అంబులెన్స్ సిబ్బందికి గర్భిణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనలో అంబులెన్స్ సిబ్బంది ఈఏంటి శివలింగంప్రసాద్, పైలట్ కోటి, గర్భిణీ కుటుంబ సభ్యులతో ఉన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ

మిర్యాలగూడ ప్రతినిధి//ఏప్రిల్ 3:(తెలంగాణ పత్రిక)



హనుమాన్ జయంతి సందర్భంగా ఈరోజు మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాలను బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్ధార్థ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేయించి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. వివిధ కాలనీలు, వార్డులు, గ్రామాల్లో నిర్వహించిన హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే యువత, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను అభినందించిన సిద్ధార్థ భక్తి భావం సమాజంలో ఐక్యతను, ధైర్యాన్ని పెంపొందిస్తుందని అన్నారు. హనుమంతుని ఆశీస్సులతో ప్రజలందరికీ శక్తి, విజయం, సంతోషం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంల పార్టీ పట్టణ మరియు మండల నాయకులు, వార్డు ఇంచార్జీలు, యువ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుడ్ ఫ్రైడే సందర్భంగా శిలువ మార్గం బారి ప్రదర్శన

-పాల్గొన్న అడ్వకేట్ మల్లెల ఉషారాణి
-బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి ఉషారాణి సేవా స్ఫూర్తికి ప్రశంసలు

కొత్తగూడెం, ఏప్రిల్ 3 (తెలంగాణ పత్రిక):



గుడ్ ఫ్రైడే సందర్భంగా ఆర్సీఎం చర్చ్ ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు శిలువ మార్గం బారి ప్రదర్శన భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. బైపాస్ రోడ్ నుండి ఆర్సీఎం చర్చ్ వరకు నిర్వహించిన ఈ ప్రదర్శనలో అనేకమంది భక్తులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి అడ్వకేట్ మల్లెల ఉషారాణి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సమాజ సేవ పట్ల ఆమె చూపుతున్న నిబద్ధతకు పలువురు ప్రశంసలు కురిపించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శిలువ మార్గంలో ఆమె చురుకుగా పాల్గొనడం గమనార్హం. ఈ ప్రదర్శనలో నలుపు మోసెస్ బాబు, శిరీష, అఖిల్ గిల్బర్ట్, అనూష, ఆనందరావు, రాజు తదితరులు పాల్గొన్నారు. క్రైస్తవ సాంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తుల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించింది. ఈ సందర్భంగా పాల్గొన్న వారు శాంతి, సోదరభావం, సేవా తత్వం వంటి సందేశాలను ప్రజల్లో విస్తరింపజేశారు.

## ఎన్నికల హామీ నెరవేర్చిన కార్పొరేటర్ కంచర్ల హేమాశ్రీ

కొత్తగూడెం, ఏప్రిల్ 3: (తెలంగాణ పత్రిక)



పంజాబ్ గడ్డ 18వ డివిజన్లో నివాసితుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ 18వ డివిజన్ కార్పొరేటర్ కంచర్ల హేమాశ్రీ ముందడుగు వేసారు. శుక్రవారం (ఏప్రిల్ 3)న 40 సంవత్సరాలుగా ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించి, కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి లైన్ను పునరుద్ధరించారు. దీని వల్ల స్థానికులకు నెలకొన్న ప్రమాదం పూర్తిగా తొలగిపోయింది. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కంచర్ల జమలయ్య, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ కార్పొరేటర్ హేమాశ్రీ మాట్లాడుతూ, ప్రజల భద్రత తమకు ముఖ్యమని, సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. స్థానిక ప్రజలు ఈ చర్యపై హర్షం వ్యక్తం చేస్తూ, ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యను పరిష్కరించినందుకు కార్పొరేటర్కు కృతజ్ఞతలు తెలిపారు.

# నిర్మల్ లో గంజాగస్తీ ప్రోగ్రాం




తెలంగాణ పత్రిక నిర్మల్ జిల్లా ఏప్రిల్ 03

నిర్మల్ పట్టణంలోని విశ్వనాథ్ పేటలో ఎస్పీ జానకి గారి ఆదేశాలతో నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, మరి ఎస్సై లింబాద్రి గారి ఆధ్వర్యంలో గంజా గస్తీ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ ప్రోగ్రాం లో రూరల్ సీఐ కృష్ణ గారు మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ గంజాయి అమ్మిన, మరియు గంజాయి ఉపయోగం చేసిన వారి మీద చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని సూచించారు. మరియు ఎక్కడ గాంజా విక్రయించిన మరియు ఉపయోగించిన ప్రజలు కూడా మమ్మల్ని సమాచారం ఇవ్వాలని కోరారు.

# గంజాయి రహిత సమాజమే లక్ష్యం

-ముధోల్ సీఐ రవీందర్ నాయక్

ముధోల్:03ఏప్రిల్(తెలంగాణ ఎక్స్ ప్రెస్)




గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా పోలీసు వ్యవస్థ పనిచేస్తుందని ముధోల్ సీఐ రవీందర్ నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ఆదేశాల మేరకు నిర్మల్ పోలీస్ మీపోలీసులో భాగంగా గాంజా గస్తీ కార్యక్రమాన్ని చేపట్టారు.మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపం లో ఉన్న పాన్ షాపులు,పలు అనుమానస్పద దుకాణాలను సీఐ, పోలీసులు సిబ్బందిచే తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడు తూ ..మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై గురించి ఆటో డ్రైవర్లకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి,వినియోగం, రవాణా చేసినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. వారి పేరును గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.గంజాయి నిర్మూలించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

## పోరాట స్ఫూర్తికి ప్రతీక దొడ్డి కొమురయ్య

-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

-ఐడీఓసీలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 03, తెలంగాణ పత్రిక

పోరాట స్ఫూర్తికి ప్రతీక దొడ్డి కొమురయ్య అని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం నిర్వహించగా, అదనపు కలెక్టర్ హాజరై దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి అధికారులతో కలిసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తిని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సౌజన్య, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి శరత్, ఎగుట్ల కనకయ్య, నాగం కుమార్, చిమల్ల మల్లేశం,స్తంబ లచ్చయ్య , వేముల నాగరాజు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన

-మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం పద్మ దేవేందర్ రెడ్డి



పాపన్నపేట, ప్రతినిధి ఏప్రిల్ 03:(తెలంగాణ పత్రిక)

పాపన్నపేట మండల బిఆర్ఎస్ నాయకులు,మిన్పూర్ మాజీ ఎంపీటీసీ బీస. గోపాల్ కుమారుడు సంతోష్ కుమార్ వివాహం సుధారాణితో మండల కేంద్రంలోని మంజీరా గార్డెన్ శుక్రవారం ఘనంగా జరిగింది. అదేవిధంగా ఎంకేపల్లి గ్రామానికి చెందిన బద్రి లక్ష్మణ్ కూతురు వివాహం పొలంపల్లి పెంటయ్య ఫంక్షన్ హాల్ సంగాయ పేట్ లో జరిగింది, మరియు అబ్లాపూర్ గుండయ్య కుమారుడి వివాహం కొత్తపల్లిలోని అనంత పద్మనాభ స్వామి ఫంక్షన్ హాల్లో జరిగింది.ఈ వివాహ వేడుకల్లో మాజీ డిప్యూటీ స్పీకర్,బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మాదేవేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ శేరి.సుభాష్ రెడ్డి,మండల నాయకులతో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.వీరి పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి,మాజీ సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు జగన్, రైతుబంధు మాజీ అధ్యక్షులు సోములు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, రామతీర్థం సర్పంచ్ సాయి రెడ్డి,మాజీ సర్పంచ్ లు శ్రీనాథ్ రావు, బద్రి. మల్లేశం, నాయకులు దుర్గయ్య, అనిల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులను

## సన్మానించిన ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై నరోత్తం



జహీరాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 3(తెలంగాణ పత్రిక )

కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిన జహీరాబాద్ మండలం మధులైతండా కు చెందిన ఉప సర్పంచ్ ప్రేమ్ రాథోడ్ జై సింగ్ రవి ఏక్ నాథ్ సంతోష్ క్రిష్ణ జైపాల్ ధన్ రాజ్ నాగేందర్ రాజు పృథ్వి వెంకట్ మనోజ్ వారి అనుచరులతో కలిసి ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై.నరోత్తం మర్యాద పూర్వకంగా వారి కార్యాలయంలో కలిసిన సందర్భంగా జరిగిన సమావేశంలో వై నరోత్తం మాట్లాడుతూ పార్టీలో కలిసిన వారందరినీ అభినందించారు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు మరిచి ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని కార్యకర్తలందరు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి సమస్యల పరిస్కారానికి కృషి చేయాలని అన్నారు వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అని అన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు యస్ గోపాల్ పుండలిక్ దేవిదాస్ పవన్ రాథోడ్ మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మేడారం సమ్మక్క గద్దెల వద్ద గాయపడ్డ బాలుడు యువాన్ ను పరామర్శించిన ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది ఏప్రిల్ 04:

తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో గత నెల 25వ తేదీన మేడారం గద్దెల వద్ద ప్రమాదానికి గురైన పూజారి సిద్దబోయిన రమేష్ కుమారుడు యువన్(6 సంవత్సరాలు సమ్మక్క గద్దె వద్ద ఆడుకుంటున్న సమయంలో గద్దె కు ఉన్న సైడ్ బండలు ఊడి ప్రమాదం జరిగినది వైద్య నిమిత్తం హాస్పటల్ తరలించగా బాలుడు యువన్ కాలు పూర్తిగా నుజ్జు నుజ్జు కావడంతో కాలు తొలగించిన వైద్యులు మరొక కాలు కూడా ప్యాక్చర్ కావడం జరిగినది బాలుడు యువాన్ పరిస్థితి చాలా బాధాకరంగా ఉందని లక్ష్మణ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. మేడారం ప్రమాదంలో గాయపడ్డ బాలుడి కుటుంబానికి 25 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని మరియు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వాలని ఈ సందర్భంగా ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకుల మర్రి లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారు. గతంలోనే ఎన్నోసార్లు బిఆర్ఎస్ పార్టీ పక్షాన అనేకసార్లు నాణ్యత లోపిస్తుందని చెప్పినప్పటికీ ప్రభుత్వం మరియు కాంట్రాక్టర్లు మంత్రులు పెడచెవిన పెట్టి కాసులు కక్కుర్తి కోసం నిరుపేద అయినా సమ్మక్క పూజారి సిద్ధబోయిన రమేష్ కొడుకు యావన్ ఒక కాలు పూర్తిగా తీసివేయగా మరొక కాలు అంగవైకల్యంలోనే



ఉండడం చాలా బాధాకరమని దీనికి కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు గారు డిమాండ్ చేశారు ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రులు సీతక్క గారు కళ్ళు తెరిచి మేడారంలో జరిగిన సంఘటనపై విచారణ జరిపించి సంబంధిత అధికారులు కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాలని మరియు ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా ఉండేందుకు మేడారం అభివృద్ధి పనులను సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించి బాధ్యులపై చర్య తీసుకొని మరియు రాబోయే రోజుల్లో ప్రమాదాలు జరగకుండా చూడాలని ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ప్రభుత్వనికి విజ్ఞప్తి చేశారు. మేడారం సమ్మక్క సారక్క



పూజారి సిద్ధబోయిన రమేష్ కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వారు తెలుపడం జరిగింది .ఈ కార్యక్రమంలో ఏటురునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావు ఎండి వాలి బాబా బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మన ఇసుక వాహనం తోనే ఇసుక రవాణా

-మన ఇసుక వాహనం, వెబ్సైట్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు

-పారదర్శకంగా ఇసుక సరఫరా

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 03, తెలంగాణ పత్రిక

ఇసుక తరలింపులో పారదర్శకత కోసం మన ఇసుక వాహనం ఆన్లైన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలులోకి తీసుకువచ్చింది. నిర్మాణాదారులు మొబైల్ అప్లికేషన్, వెబ్సైట్ ద్వారా తమకు నచ్చిన ఇసుక రీచ్ నుంచి ఇసుక బుకింగ్ చేసుకునే అవకాశం ఉంది. ఇసుక పక్కదారి పట్టకుండా .. నిర్ణీత పత్రాలు జత చేసే వారికి అందుబాటులో ఉంటుంది. ఆన్లైన్ విధానం ద్వారా సులభంగా బుకింగ్ చేసుకునే వీలు ఉంది.సెంటర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన .మన ఇసుక వాహనం అప్లికేషన్, ఆన్లైన్ వెబ్ సైట్ లో నిర్మాణదారులు ఇసుక ఎలా బుక్ చేసుకోవాలి? డబ్బు ఎలా చెల్లించాలి? ఇసుక ఏ రీచ్ నుంచి పొందాలి? ఆన్లైన్ లో పూర్తి వివరాలతో వీడియో సందేశం అందుబాటులో ఉంది.జిల్లా కమిటీ ఆమోదించిన ఇసుక రీచ్ ల నుంచే ఇసుక తరలించ నున్నారు. ఇసుక తరలింపులో నేరుగా కూపన్లు ఇచ్చే విధానం నుంచి ఆన్లైన్ ద్వారా పొందే విధానం అమలు చేయనున్నారు.ఇసుక కేటాయింపు, తరలింపు పూర్తి పారదర్శకంగా ఉంటుంది. మధ్యవర్తుల అవసరం లేకుండా ప్రజలు నేరుగా ఆన్లైన్ ద్వారా ఇసుకను బుక్ చేసుకునే సౌకర్యం కల్పించబడింది. దీనివల్ల అక్రమ రవాణా నివారించబడుతుంది.అందుబాటులో టోల్ ఫ్రీ నంబర్, మెయిల్ ఐడీ మన ఇసుక వాహనం విషయమై సమాచారం, వివరాలు తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో పెట్టారు. 040-23120421/8333923732 ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంటాయి. అలాగే మెయిల్ ఐడీ helpdesk.tsmiv@cgg.gov.in ఉన్నాయి.మన



ఇసుక వాహనం ద్వారా ఇసుక బుక్ చేసుకునేటప్పుడు అప్లోడ్ చేయవలసిన ధృవీకరణ పత్రాలు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి: అధికారి జారీ చేసిన ధ్రువపత్రం. ఇతర ఇంటి నిర్మాణానికి సంబంధిత పంచాయతీ కార్యదర్శి, అధికారి జారీ చేసిన ఇంటి నిర్మాణ అనుమతి పత్రం.ప్రభుత్వ పనులకు సంబంధిత కార్య నిర్వహణ ఇంజనీర్ జారీ చేసిన అనుమతి పత్రం (అప్లోడ్ చేసే డాక్యుమెంట్స్ 200 కేబీ లోపల ఉండాలి. పీడీఎఫ్, జే పేజీ విధానంలో ఉండాలి.

## వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలే లక్ష్యం: సిరిసిల్ల విభాగపు ఇంజనీర్ అంజయ్య

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 03, తెలంగాణ పత్రిక

వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సేవలు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని సిరిసిల్ల విభాగపు ఇంజనీర్ శ్రీ అంజయ్య తెలిపారు.సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్.ఈ) బి. బిక్షపతి ఆదేశాల మేరకు శుక్రవారం గంభీరావుపేట మండలంలోని ముస్తాబాద్ సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగులు, నిర్వహణ మరియు పర్యవేక్షణ (ఓ ఆ ఎం) సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవి కార్యాచరణ, వ్యవసాయ సర్వీసుల మంజూరు మరియు విద్యుత్ భద్రతపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా విభాగపు ఇంజనీర్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో విద్యుత్ లోడ్ పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడం, ప్రమాదభరితంగా ఉన్న లైన్లను గుర్తించి మరమ్మతులు చేయడం, వంగిన విద్యుత్ స్తంభాలను తక్షణమే మార్చడం వంటి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.అదేవిధంగా, క్షేత్రస్థాయిలో పనులు నిర్వహించే ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. తలపాగా (హెల్మెట్), చేతి తొడుగులు (హ్యాండ్ గ్లౌజ్), ఎర్త్ రాడ్ వంటి భద్రతా పరికరాలు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు చేయరాదని హెచ్చరించారు. గ్రామీణ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో



ఉన్న సేవలను త్వరితగతిన విడుదల చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గంభీరావుపేట సహాయ విభాగపు ఇంజనీర్ శ్రీనివాస్, సహాయ ఇంజనీర్ విష్ణు తేజ, నిర్వహణ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం





ముధోల్:03ఏప్రిల్(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రమైన ముధోల్ లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రజా నాయకుడు లక్ష్మీపురం నారాయణరెడ్డి, రావుల శ్రీకాంత్, ప్రధాన వక్తగా శ్రీ సరస్వతి విద్యాపీఠం జిల్లా ఉపాధ్యక్షులు ధర్మపురి సుదర్శన్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విద్యార్థి దశలో ఉండే క్రమశిక్షణ పాటిస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల అభిప్రాయాలను అడిగి ఆచార్యులు మార్గదర్శనం చేశారు. అనంతరం 8,9 వ తరగతుల విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. 9వ తరగతి విద్యార్థులు పదోతరగతి విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఉస్మానియా విశ్వవిద్యాల యంలో రసాయన శాస్త్రంలో డాక్టర్ పట్టపొందిన డాక్టర్ రావుల శ్రీకాంత్ (బాసర ట్రిబుల్ ఐటీ రసాయనశాస్త్ర ఆచార్యుల)ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు రవీంద్రనాథ్ పాండే, తాడేవార్ సాయినాథ్, పాఠశాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు కొండావార్ సంజీవ్, రోళ్ళ రమేష్, సహ కార్యదర్శి నవీన్ దర్బార్, సభ్యులు సంతోష్ దత్తాత్రి వెంకటేష్, పాఠశాల ప్రధానాచార్యులు సారథి రాజు అకాడమిక్ ఇంచార్జ్ స్వప్న తోపాటు పోషకులు ఆచార్యులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ళు ప్రారంభించి.. లబ్ధి దారుల ఇంట్లో సన్న బియ్యంతో సహపంక్తి భోజనం

-కాంగ్రెస్ ప్రభుత్వం లో నిరుపేదల సొంత ఇంటి కల నెరవేరింది.....ఎమ్మెల్యే బిఎల్ఆర్, పున్నా కైలాస్

మిర్యాలగూడ ప్రతినిధి//ఏప్రిల్ 3:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ మండలం తకెళ్ళపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళు లబ్ధి దారులు నడింపెల్లి లక్ష్మయ్య మరియు మైనవారి గూడెం గ్రామంలో లబ్ధి దారులు గంగపూరి రేణుక - యాదయ్య నూతన ఇందిరమ్మ ఇళ్ళు గృహప్రవేశంలో పాల్గొన్న మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, మరియు డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక సమానత్వం కోసం పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం ప్రారంభమై ఎడాది పూర్తయిన సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ళు లబ్ధిదారుడి ఇంట్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి సన్నబియ్యం తో సహపంక్తి భోజనం చేయడం జరిగింది..ఈ సందర్భంగా లబ్దిదారుల కుటుంబ సభ్యులు ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఎన్నయేళ్ళ సొంత ఇంటి



కల నెరవేరడమే కాక సన్నబియ్యం తో మా కడుపు నింపారు అని ఆనంధాలు వ్యక్తం చేసారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో నిరుపేదల సొంత ఇంటి కలలు నెరవేరుస్తూ వారి కుటుంబాలలో ఆనంధాలు చూస్తుంటే ప్రజా ప్రభుత్వం లో భాగస్వామిని అయినందుకు గర్వంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుతూనే నిరుపేదల సంక్షేమం కోసం సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,



ఇందిరమ్మ ఇళ్ళు. లాంటి అనేక వినూత్న పథకాలను అమలు చేస్తూ పేదల సంక్షేమానికి పెద్ద పీఠ వేస్తున్నారు అని అన్నారు. ప్రజా ప్రభుత్వానికి పేద ప్రజల ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని... అనునిత్యం మీకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్స్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు మరియు బిఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు..

# దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శం

-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ జిల్లా ప్రతినిధి(తెలంగాణ పత్రిక) 03 ఏప్రిల్

దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ వెనుకబడిన తరగతుల సహాయ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ , సంఘ నాయకులు యాదగిరి,తో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహానుభావుడని తెలిపారు. అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం



చేసిన తొలి అమరుడిగా ఆయన చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. కొమురయ్య చూపిన ధైర్యం, త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు.ప్రజల హక్కులు, సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవారమవుతామని తెలిపారు. సమాజంలో



న్యాయం, సమానత్వం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయులను కులం, వర్గం అనే పరిమితుల్లో చూడకుండా వారి ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో , బీ.సీ సంఘాల ప్రతినిధులు, ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూరులో నూతన వైద్య సేవలకు శ్రీకారం

-శ్రీ సూర్య హాస్పిటల్ ప్రారంభం

పాలకుర్తి/తొర్రూరు(తెలంగాణ పత్రిక)03 ఏప్రిల్


తొర్రూర్ మున్సిపల్ పరిధిలోని చింతలపల్లి రోడ్డులో నూతనంగా నిర్మితమైన శ్రీ సూర్య హాస్పిటల్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆధునిక సౌకర్యాలతో, నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రిని తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో సమీప ప్రాంతాల్లోనే చికిత్స పొందే అవకాశం ఉండటం ప్రజలకు పెద్ద ఊరటనిచ్చే అంశమని తెలిపారు. నూతనంగా ప్రారంభమైన శ్రీ సూర్య హాస్పిటల్ ద్వారా స్థానికులకు తక్కువ ఖర్చుతో, అధిక నాణ్యత గల వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. అలాగే ఆరోగ్యమే మహాభాగ్యం అని, ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వైద్యులు సేవా భావంతో పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ ఆసుపత్రి ప్రాంతీయంగా ఒక ఆదర్శ వైద్య కేంద్రంగా ఎదగాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇరెంట్టి



సాయిక్రిష్ణ, స్థానిక మున్సిపల్ వార్డు కౌన్సిలర్ బుసాని జయమ్మ ఉప్పలయ్య, ముద్దసాని సురేష్, అనుమాండ్ల నరేందర్ రెడ్డి, తాల్లపల్లి బిక్షం గౌడ్, తూర్పాటి రాంబాబు, సట్ల చంటి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# తక్కెళ్ళపాడు లో భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు





-ముఖ్యఅతిథిగా ప్రార్థనలో పాల్గొన్న...ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ ప్రతినిధి//ఏప్రిల్ 3:(తెలంగాణ పత్రిక):-

ఈరోజు మానవాళి పాప విముక్తి కోసం, లోక కల్యాణం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన కరుణామయుడు యేసుక్రీస్తు బలిదానాన్ని స్మరించుకునే పవిత్ర దినం 'గుడ్ ఫ్రైడే' ఘనంగా నిర్వహించారు. మిర్యాలగూడ మండలం తకెళ్ళపాడు గ్రామంలో క్రైస్తవ సోదరులతో కలిసి చర్చ్ లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ "ప్రేమ, సహనం మరియు త్యాగం అనేవి యేసుప్రభువు లోకానికి అందించిన గొప్ప ఆయుధాలు. శత్రువులను సైతం ప్రేమించాలని, తోటివారికి సహాయం చేయాలని ఆయన బోధించిన మార్గం నేటి సమాజానికి ఎంతో ఆవశ్యకం అని అన్నారు. యేసుక్రీస్తు చూపిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని, సమాజంలో సోదరభావాన్ని పెంపొందించుకోవాలని ఆయన కోరారు..క్రీస్తు త్యాగ నిరతిని స్మరిస్తూ, నిరుపేదలకు సేవ చేయడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. యేసుక్రీస్తు ఆశీస్సులు మన నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, అందరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు, కాంగ్రెస్ నాయకులు మరియు బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## ఘనంగా దొడ్డి కొమురయ్య 99వ, జయంతి వేడుకలు



పెద్ద గూడూరు/ కొత్తగూడ/ గంగారం ఏప్రిల్ 03. (తెలంగాణ పత్రిక ప్రతినిధి)

మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండలంలో తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, విసునూరు గడీలను నేల కూల్చిన ఉద్యమ దీశాలి, నైజాం తూటాలకు నేలరాలిన తొలి అమరుడు, దొడ్డి కొమరయ్య కురుమ 99వ, జయంతి వేడుకలను పురస్కరించుకొని, గూడూరు మండలం లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య విగ్రహ దాత చీర బిక్షపతి, కుల పెద్దమనుషులు మండల కొమురయ్య, కురుమ సంఘం మండల అధ్యక్షుడు మండల ఉపేందర్, మాజీ ఎంపీపీ నూనావత్ రమేష్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆరే వీరన్న, మహబూబాబాద్ డిసిసి కార్యదర్శి వాంకుడోత్ కొమ్మాలు నాయక్, పోతరాజు రవి, మండల మల్లేష్, కోరే దేవేందర్, కోరే అనిల్, మంగ కుమారస్వామి, మండల సుధాకర్, దయ్యాల కొమురయ్య, కుండే కుమారస్వామి, దూడ ఐలయ్య, చీర బోయిన కుమార్, నూకల సురేందర్, మండల సుధాకర్, దూడ ఐలయ్య , కుండే కుమార స్వామి, పాపాని శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

## త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే చరిత్ర ప్రాముఖ్యత ఇదే బ్రదర్ వై సామెల్

జహీరాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 3(తెలంగాణ పత్రిక )



క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పండుగ తర్వాత అత్యంత పవిత్రమైన, ఆధ్యాత్మిక చింతనకు ప్రాధాన్యత కలిగిన రోజుల్లో గుడ్ ఫ్రైడే ఒకటి. లోక రక్షకుడిగా భావించే యేసుక్రీస్తు మానవాళి పాపాల కోసం తన ప్రాణాలనే అర్పించిన రోజును గుర్తు చేసుకుంటూ ఈ పండుగను జరుపుకుంటారు

ఇది క్యాలెండర్లో ఒక తేదీ మాత్రమే కాదు ప్రతి విశ్వాసి గుండెలో కరుణ త్యాగం క్షమాగుణానికి ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది ఆ శుక్రవారం ప్రపంచం చీకటిగా మారిన వేళ జరిగిన విషాదకర సంఘటనలను గుర్తు చేసుకుంటూ భక్తితో చేసే ప్రార్థనలు ఆధ్యాత్మిక ప్రయాణంలో ఒక మైలురాయిలాంటి అనుభూతిని కలిగిస్తాయి ఈ సంవత్సరం అంటే 2026లో గుడ్ ఫ్రైడే ఏప్రిల్ 3వ తేదీన వస్తుంది. చంద్రుడి కదలికలు వసంతకాలంలో సంభవించే విషువత్తు ఆధారంగా ప్రతి సంవత్సరం ఈ తేదీ మారుతూ ఉంటుంది ఈ రోజును 'గుడ్ ఫ్రైడే' అని ఎందుకు పిలుస్తారో తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది . క్రైస్తవ మతంలో 'పరిశుద్ధ వారం'లో ఈ రోజు ఒక ముఖ్యమైన ఘట్టం అనేక దేశాలలో ఈ రోజును ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తారు ప్రజలు తమ ఆధ్యాత్మిక చింతనలో గడపడానికి అవకాశం కల్పిస్తారు ద్వేషం కోపం వంటి వాటిని విడిచిపెట్టి అందరినీ క్షమించాలనే గొప్ప సందేశాన్ని ఈ పవిత్ర శుక్రవారం మనకు తెలియజేస్తుంది యేసు క్రీస్తు చూపిన ప్రేమ త్యాగం క్షమాగుణం అనే గొప్ప విలువలను ఈ రోజు మనకు గుర్తు చేస్తుంది ఆయన బోధనలను ఆచరించడానికి ఆయన అడుగుజాడల్లో నడవడానికి ఈ రోజు ఒక అవకాశం.

## దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధిద్దాం

-వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన దొడ్డి కొమురయ్య 99వ జయంతి....జాజుల లింగం గౌడ్

మిర్యాలగూడ ప్రతినిధి//ఏప్రిల్ 3:(తెలంగాణ పత్రిక)




భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం భూస్వాములకు, దొరలకు ఎదురు నిలిచి వీరోచిత పోరాటం చేసి అసువులు బాసిన దొడ్డి కొమరయ్య 99వ జయంతి సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఎల్బీనగర్ లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన.

అనంతరం అయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దేశ్ ముఖిలు, విసునూరు దొరల అరాచకాలకు వ్యతిరేకంగా ధైర్య సాహసాలతో దొడ్డి కొమరయ్య పోరాటం జరిపారని అన్నారు. ఆయన చూపిన పోరాటపటిమా నేటికీ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఆనాడు వారి అరాచకాలకు బలి అయిన తొలి అమరుడు దొడ్డి కొమరయ అని అతని పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని సామాజిక తెలంగాణ సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ ముదిరాజ్, మహేష్ యాదవ్, భాస్కర్, పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
తెలుగు దిన పత్రిక
నిజం మా నిజం



# నేడు కొత్తపల్లికి పోచారం రాక

కోటగిరి తెలంగాణ పత్రిక ఏప్రిల్ 3.



కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం భవనం, ప్రాథమిక పాఠశాల భవనం, ఆరోగ్య కేంద్రం సిసి రోడ్ పనుల ప్రారంభోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి వస్తున్నారని కొత్తపల్లి ముదిరాజ్ సంఘ అధ్యక్షులు కోటగిరి సుదర్శన్ ప్రకటనలో తెలిపారు. కోటగిరి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు మదిరాజ్ సంఘ అధ్యక్షులు కార్యదర్శులు మండల ప్రజా ప్రతినిధులు ఉమ్మడి మండలాల మాజీ జెడ్పిటిసిలు మాజీ ఎంపీటీసీలు సహకార సంఘ అధ్యక్షులు మార్కెట్ కమిటీ అధ్యక్షులు వైస్ చైర్మన్ డైరెక్టర్లు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాల్గొనీ ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు .

# కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం


**– కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీముడు నాయక్**

ఏప్రిల్ 03 తెలంగాణ పత్రిక చారకొండ:



చారకొండ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానని కాంగ్రెస్ పార్టీ చారకొండ మండల అధ్యక్షుడు కేతావత్ భీముడు నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ కు, ఎన్నికకు సహకరించిన నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీని పటిష్ఠం చేస్తానని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలను అందరినీ కలుపుకుని పోతూ మండలంలో పార్టీ విజయానికి శ్రమిస్తానని తెలిపారు.

# శ్రీ వనదుర్గ పెద్దమ్మ పెద్దిరాజుల 16 పండగ



భిక్కనూరు ఏప్రిల్ 03 (తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి)

మండల కేంద్రంలో గల శ్రీ వనదుర్గ పెద్దమ్మ పెద్దిరాజుల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం 16 పండగకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాద స్వీకరించారు,ఈక్రమంలో ఉత్సవాల్లో అమ్మవారికి భక్తులు సమర్పించిన ఓడిబియ్యంను వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు,అనంతరం అన్న ప్రసాదంకు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు,అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పట్లు చేశారు, ఈకార్యక్రమంలో ముదిరాజ్ సదర్ సంఘం అధ్యక్షులు బండి రాములు ముదిరాజ్, గ్రామంలోగల ముదిరాజ్ పాండిల అధ్యక్షులు మాజీ ఎం.పి.టి.సి బత్తుల లక్ష్మీ నర్సింలు, బత్తుల బిక్షపతి, పసుల చంద్రం,బత్తుల నాగభూషణం, బండి స్వామి, గంగల యాదగిరి,మాజీ సర్పంచ్ తునికి వేణు,ఉప్పరి రమేష్, గంగల రవీందర్,ఉపాధ్యక్షులు గుడికమిటీ సభ్యులు,గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మూడు నెలలకు సరిపోయే రేషన్ బియ్యం ఒకేసారి

**సహకరించాలని కోరిన డీలర్ – సమ్మయ్య**

ఎలిగేడు, ఏప్రిల్ 03, (తెలంగాణ పత్రిక)



గ్రామాలలో రేషన్ డీలర్ల దుకాణాల వద్ద బారులు తీరిన జనాలు. ఏప్రిల్, మే ,జూన్ మూడు నెలలకు సరిపోయే రేషన్ బియ్యం ఒకే నెలలోనే ఇవ్వడంతో 6 కిలోల బియ్యానికి బదులు మూడు నెలల బియ్యం 18 కిలోలు ఇవ్వడంతో, కార్డు సభ్యుడు మూడుసార్లు వేలిముద్ర చెయ్యడం దీనితో ఆలస్యం జరుగుతుందని దీనికి తగ్గట్టు సర్వర్ స్లో అవడంతో ఇంకాస్త జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డీలర్ కొత్తకొండ సమ్మయ్య మాట్లాడుతూ గ్రామంలో కొత్తగా 119 రేషన్ కార్డులతో కలిపి మొత్తం 764 కార్డులు ఉన్నాయని. వాటికి గాను రేషన్ బియ్యం మామూలుగా ఒక్కరికి గాను ఆరు కిలోల చొప్పున 764 కార్డు హోల్డర్లకు 120 క్వింటాళ్ల రేషన్ బియ్యం పంపిణీ చేయగా ఈ ఏప్రిల్ నెలలో ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలు రేషన్ బియ్యం ఒకేసారి ఈ ఏప్రిల్ నెలలో 360 క్వింటాళ్ల రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నామని దీనికిగాను కార్డు హోల్డర్ దారుడు నుండి మూడు సార్లు బయోమెట్రిక్ తీసుకోవడం జరుగుతుందని దీనివల్ల కాస్త జాప్యం జరుగుతుందని రేషన్ బియ్యం తీసుకోవడానికి వచ్చిన వ్యక్తులు సహకరించాలని కోరారు.

# దేవుని గుట్ట విద్యార్థికి ఘన సన్మానం

**–సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు సీతారాం నాయక్.**

కోటగిరి తెలంగాణ పత్రిక ఏప్రిల్ 3.



కోటగిరి మండలంలోని దేవుని గుట్ట తండా గ్రామానికి చెందిన వడిత్య పూజ దేవునిగుట్ట ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎంట్రన్స్ పరీక్ష రాసి జిల్లాలోని నవోదయ విద్యాలయంలో 77వ ర్యాంక్ సాధించినందుకు దేవుని గుట్ట గ్రామంలో సేవలాల్ సేన జిల్లా అధ్యక్షులు సీతారాం నాయక్ వారి కమిటీ సభ్యులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీతారాం నాయక్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నారని అన్నారు. దేవుని గుట్ట గ్రామానికి చెందిన వడిత్య పూజ జిల్లాలోని 72వ ర్యాంకు సాధించి నవోదయ విద్యాలయంలో సీటు సంపాదించినందుకు ఆమెకు అభినందనలు తెలిపారు. ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బులు జమ చేసుకొని ఆ డబ్బులతో సేవలాల్ జగదంబ మందిరంలో బోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించి తండావాసులకు ఉత్తేజపరిచింది. చదువులో మంచి నైపుణ్యాన్ని కనబరుస్తూ భక్తిశ్రద్ధలతో ఆమె అనుకున్న గమ్యానికి చేరటంతో ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గ్రామస్థులకు నైవేద్యాన్ని పంచి పెట్టింది. తాండవాసులందరూ ఆమె నవోదయ పాఠశాలలు సీటు సంపాదించినందుకు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోర్ర రవి నాయక్ వార్డు మెంబర్లు వడిత్య రామ్ కిషన్ బానోత్ యశ్వంత్ పుండలింక్ నాయక్ కిషన్ పకీర తుకారాం విట్టల్ శంకర్ నారాయణ రవి రూప్ సింగ్ ధన్సింగ్ మహారాజ్ గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ పట్టణంలో నిన్న సాయంత్రం హనుమాన్ జయంతి సందర్భంగా మహిళలు బైక్ ర్యాలీ తీయడం జరిగింది






తెలంగాణ పత్రిక బోధన్ ఏప్రిల్. 2

బోధన్ పట్టణంలోని హనుమాన్ మందిర్ నుండి కొత్త బస్టాండ్ వరకు మార్వాడి మహిళలు మరియు హిందూ మహిళలు అందరు కలిసి పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ తీయడం జరిగింది హిందూ ధర్మాన్ని కాపాడాలంటూ నినాదాలు చేసుకుంటూ జై హనుమాన్ జైజై హనుమాన్ హిందూ సనాతన ధర్మాన్ని పాటిస్తూ పెద్ద ఎత్తున శోభాయాత్ర మరియు మహిళల కోలాటం కర్ర సాము అనేక రకాల వస్త్రధారులతో పిల్లలు డాన్సులు వేయడం హనుమాన్ శోభాయాత్ర బోధన్ నర్సి రోడ్డు హనుమాన్ మందిర్ నుండి కొత్త బస్టాండ్ వరకు హనుమాన్ స్వాములు హనుమాన్ స్వాములు పాదయాత్ర తో పాటు మరియు హనుమాన్ విగ్రహం మరియు ట్రాలీపై పెట్టుకుని ఊరేగింపుగా రాత్రి పది గంటల వరకు ఈ శోభ యాత్ర అంగరంగ వైభవంగా తీయడం జరిగింది ఇట్టి శోభాయాత్రకు పోలీస్ శాఖ వారు ముందస్తు జాగ్రత్తతో ఎక్కడికి అక్కడ పోలీసు సిబ్బందిని పకడ్బందీగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోధన్ మున్సిపల్ చైర్మన్ పద్మ శరత్ రెడ్డి మరియు బోధన్ ఎసిపి శ్రీనివాస్ టౌన్ ఎస్ హెచ్ ఓ వెంకటనారాయణ రూరల్ ఎస్సై మచ్చందర్ రెడ్డి రూరల్ శ్రీ విజయబాబు తదితరులు పాల్గొన్నారు.



# కామారెడ్డిబార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బత్తుల నారాయణ, బండారి సురేందర్ రెడ్డి

కామారెడ్డి ,ఏప్రిల్ 3, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ఎన్నికలలో భాగంగా గురువారం ఎన్నికలు నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికలలో అధ్యక్షులుగా బత్తుల నారాయణ, ప్రధాన కార్యదర్శిగా బండారు సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా రాజు, సంయుక్త కార్యదర్శిగా భార్గవ్ చంద్ర భూపాల్, కోశాధికారిగా విఠల్ రావు, లైబ్రరీ సెక్రటరీగా దేవేందర్ గౌడ్, క్రీడల కార్యదర్శిగా యాదగిరి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులకు పోటీ ఉండటంతో ఆరుగురు పోటీలో నిలువగా వీరికి ఎన్నికలు నిర్వహించబడ్డాయి. ఎన్నికల్లో గంగరాజు, సంజిత్, షేక్ ఇర్ఫాన్ హుస్సేన్ గెలుపొందారు. ఈ కార్యవర్గం సంవత్సరం పాటు కొనసాగుతుందని బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ సూచనల మేరకు ప్రతి సంవత్సరం ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి ఈ కార్యవర్గం 2027 ఏప్రిల్ వరకు కొనసాగుతుందని ఎన్నికల అధికారి వైద్య అమృత రావు తెలిపారు.





# మానవాళికి మార్గదర్శకం ఏసు క్రీస్తు జీవితం...పాస్టర్, వేముల

**–జెకర్యా–ఎలిజబెత్**

మాడ్గులపల్లి/నల్గొండ/ఏప్రిల్ 3:(తెలంగాణ పత్రిక):–

ప్రపంచ మానవాళికి మార్గ దర్శకం ఏసుక్రీస్తు జీవితం అని గేత్సమనే ప్రార్థన మందిరం తోపుచర్ల పాస్టర్ వేముల జెకర్యా–ఎలిజబెత్ లు అన్నారు. గుడ్ ఫ్రైడే ను పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండలం లోని వివిధ గ్రామా లలో క్రైస్తవ సోదరులు వివిధ సంఘాల ఆధ్వర్యంలోని చర్చిలలో భక్తిశ్రద్ధలనడుమ శిలువ యాత్రను ఘనంగా నిర్వహించారు. మండలంలోని తోపుచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని గేత్సమనే ప్రార్థన మందిరంలో పాస్టర్ వేముల జెకర్యా–ఎలిజబెత్, దంపతుల ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే సందర్భంగాప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. యేసుక్రీస్తు భూలోకంలో పాపుల రక్షణ కోసం అనుభవించిన శ్రమలు, ఆయన శిలువ మార్గం, మానవాళి విమోచన కోసం చేసిన మహాత్యాగాన్ని స్మరించుకున్నారు. ప్రేమ కరుణ క్షమ సహనం త్యాగం వంటి మహత్తర విలువలను ఏసు తన జీవితం ద్వారా ప్రపంచానికి బోధించారని శత్రువులను సైతం ప్రేమించాలని కష్టాలలో ఉన్నవారిని ఆదుకోవాలని అనే సందేశాన్ని ప్రతి ఒక్కరు ఆచరించాల్సిన అవసరం ఉందని పాస్టర్ వేముల జెకర్యా–ఎలిజబెత్, సూచించారు. గత 40 రోజులుగా భక్తులు ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు నిర్వహించగా,ఈ దీక్షలు ఆదివారం ఈస్టర్ వేడుకలతో ముగియనున్నట్లు పాస్టర్ వేముల.జెకర్యా–ఎలిజబెత్, తెలిపారు. ఈకార్యక్రమంలో టీ.రాజు, బి.సైదులు, కే.శ్రీను, జి.సైదులు, కే.శంకర్, జి.రాములు, వి.నవీన్, ఎం.సుదర్శన్, కే . పరమేష్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంద్రకరణ్ రెడ్డికి రెండు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్చార్జిగా నియామకం

కామారెడ్డి ,ఏప్రిల్ 3, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):

కాంగ్రెస్ అధిష్ఠానం కామారెడ్డి జిల్లాబిక్కనూర్ మండలం రామేశ్వరపల్లికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డిని ఖానాపూర్ ఆదిలాబాద్అసెంబ్లీ కోఆర్డినేటర్గా నియమించింది. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఖానాపూర్, ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలకు కోఆర్డినేటర్గా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ బలోపేతం, నాయకత్వ సమన్వయం, కేడర్ను సమర్థవంతంగా నడిపించడం లక్ష్యంగా ఈ నియామకం చేపట్టినట్లు అధిష్ఠానం తెలిపింది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయిలో బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని పేర్కొంది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



# కామారెడ్డి డిగ్రీ కళాశాల భూముల అన్యాక్రాంతంపై స్పష్టతనివ్వాలి

**-ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్**

కామారెడ్డి, ఏప్రిల్ 03,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల అన్యాక్రాంతంపై స్పష్టత ఇవ్వాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డిని ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ కోరారు. ఈ మేరకు శు క్రవారం ఆయన ఎమ్మెల్యేకు బహిరంగ లేఖ రాశారు. డిగ్రీ కళాశాలకు సంబంధించి 26 ఎకరాల భూమిలో మూడు నివేదికలు వేర్వేరుగా చూస్తే ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూఫిబ్రవరిలో కలెక్టరేట్ కార్యాలయం వద్ద ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల్లో జరిగిన అవకతవకలపై ఆధారాలతో వస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా సమర్పిస్తానని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. తన వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించకుండానే మొత్తం కళాశాల భూములకు సంబంధించిన ఆర్టీఐ దరఖాస్తును కలెక్టర్ కార్యాలయంలో సమర్పించి ఎమ్మెల్యే వెళ్లిపోయారన్నారు. ఆ సమాచారాన్ని తాను తెలుసుకుని విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కమిటీ సభ్యుడిగా ఉండడం, ఆయన తండ్రి కేపీ రాజా రెడ్డి ప్రధాన కార్యదర్శిగా పనిచేయడంతో నాడు భూదస్త్రాలు వారి వద్దనే ఉండడం వారిపై బాధ్యతను మరింత పెంచుతున్నాయన్నారు.



## దాము లాంటి కౌన్సిలర్ దొరకడం మీ అదృష్టం ప్రజలతో జిల్లా కలెక్టర్ ఆసక్తికర వ్యాఖ్యలు

తెలంగాణ పత్రిక బోధన్ ఏప్రిల్ 03



ప్రజా పాలనలో భాగంగా బోధన్ 26వ వార్డులో పర్యటించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజలను ఆరా తీశారు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇతర బతకాల కోసం ఎవరైనా కమిషన్లు అడుగుతున్నారా అని ప్రశ్నించాగా కౌన్సిలర్ దామోదర్ రెడ్డి దాము అత్యంత పారదర్శకంగా పనిచేస్తున్నారని ప్రజలు బదులిచ్చారు. దాము వరుసగా మూడుసార్లు కౌన్సిలర్ గా గెలవడం. ప్రజల అదృష్టం అని కలెక్టర్ అన్నారు. నిత్యం ఉదయం 6 గంటలకు వార్డులలో పర్యటించి ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజల స్పందన పై సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్. ఇలాంటి కౌన్సిలర్ దొరకడం వార్డు ప్రజల అదృష్టం అని ఆయన భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు స్వీకరించాలని ఆమె అన్నారు.

## పెంటాఖుర్దు గ్రామంలో హనుమాన్ స్వాములు హనుమాన్ జయంతి చాలా ఘనంగా నిర్వహించుకున్నారు

తెలంగాణ పత్రిక బోధన్.ఏప్రిల్ 03



బోధన్ మండలంలోని పెంటఖుర్దు గ్రామంలో హనుమాన్ జయంతి అనేది హిందువులకు ఎంతో పవిత్రమైన పండుగ. ఈ రోజు శ్రీ హనుమంతుడు జన్మించిన రోజు అని భావిస్తారు. ఆయనను భక్తి, శక్తి, ధైర్యం, సేవా భావం యొక్క ప్రతీకగా పూజిస్తారు. ముఖ్య ప్రత్యేకతలు. భక్తి మరియు శక్తి ప్రతీక హనుమంతుడు రాముడుకు పరమభక్తుడు. ఆయన భక్తి, విధేయత ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తుంది. చెడు శక్తుల నుండి రక్షణ హనుమంతుడిని పూజించడం ద్వారా దుష్టశక్తులు, భయాలు, అడ్డంకులు తొలగుతాయని విశ్వాసం ఉంది. ఆరోగ్యం మరియు ధైర్యం కోసం పూజ హనుమాన్ జయంతి రోజున హనుమాన్ చాలీసా, సుందరకాండ పఠనం చేస్తారు. దీని వల్ల మనసుకు శాంతి, శరీరానికి శక్తి కలుగుతాయని నమ్మకం. ఉపవాసం మరియు ప్రత్యేక పూజలు భక్తులు ఈ రోజు ఉపవాసం చేసి, ఆలయాలకు వెళ్లి హనుమంతుడిని ప్రార్థిస్తారు. కొందరు తులసి, బెల్లం, వెన్న వంటి నైవేద్యాలు సమర్పిస్తారు. సేవా భావం ప్రాముఖ్యత హనుమంతుడు చేసిన సేవలను స్మరించుకుంటూ, ఇతరులకు సహాయం చేయడం.

# లినాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినీలకు ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ

తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

హనుమకొండ: నాయిని విశాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పింగిలి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినీలకు ఉచిత వైద్య పరీక్షలు కార్యక్రమం నాయిని రాజేందర్ కుమారుడు నాయిని విశాల్ రెడ్డి స్మారకార్థం ఏర్పాటు చేసిన ఈ ట్రస్ట్ ద్వారా సామాజిక సేవ కార్యక్రమాని ఈ డాక్టర్ నాయిని శ్రీగోదా విష్ణు రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ సూచించారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యమని చెప్పారు. సమయానికి పరీక్షలు చేయించుకోవడం ద్వారా పెద్ద వ్యాధులను నివారించవచ్చని అనంతరం విద్యార్థినీలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు




# గుడ్ ఫ్రైడే ను కొనియాడిన కథోలిక్ బిషప్

**- వేల మందితో ఖమ్మం పట్టణంలో ప్రదర్శన**

తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా వేల మందితో ఏసుప్రభు బాధలు , శ్రమలు సిలువపై వేషదారణంగా ప్రదర్శించారు . పాత బస్టాండ్ ఏరియా నుండి జడ్పీ సెంటర్ , ఎన్టీఆర్ సర్కిల్ , కొత్త బస్టాండ్ మరియు కరుణగిరి వరకు ఈ ప్రదర్శన కొనసాగింది . ఏసుప్రభు చనిపోయిన సంఘటనలను జ్ఞాపకం చేసుకుంటూ కథోలిక్ చర్చి ఆధ్వర్యంలో ప్రముఖ ఫాదర్లు చే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి బిషప్ సగిలి ప్రకాష్ మాట్లాడారు . దైవ కుమారుడు అయినప్పటికీ మన వల్ల బాధింపబడి రక్షణ కోసం ప్రాణం అర్పించి , క్షమాపణ పంచి త్యాగము చేసిన వ్యక్తి ఏసుక్రీస్తు అని బదుగు , బలహీన కుటుంబాలకు వెలుగులు నింపి అందరికీ పరలోక దీవెనలు పంచిన దైవ కుమారుడు అని కొనియాడారు . ఈ మహా ప్రదర్శన కరుణగిరి వరకు 40 రోజులు దీక్ష తీసుకున్న వారితో కొనసాగింది . కరుణగిరి లో ప్రత్యేక ప్రార్ధనలు చేసినారు . ప్రత్యేక ఆకర్షణగా యువకులచే ఏసు ప్రభు పాత్ర , మేరీమాత వేషధారణ మరియు భక్తి ఉపన్యాసాలతో , గేయలతో



యాత్ర కొనసాగింది . ఈ కార్యక్రమంలో ఫాదర్ లు ఎస్ ఐజాక్ , జ్ఞానేశ్ , జయరాజు , గోవా శౌరయ్య , టి ఆంటోనీ , జి సురేష్ , ఏసు రాజు జోసెఫ్ , రాజు మరియు సిస్టర్లు , బ్రదర్ లు సంఘస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .

## బిచ్కుందలో అయ్యప్ప కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మ్యాచింగ్ సెంటర్ ప్రారంభం

జుక్కల్ ఆర్సీ / తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

బిచ్కుంద పట్టణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మ్యాచింగ్ సెంటర్‌ను మున్సిపల్ చైర్మన్ సీమా శెట్కార్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇలాంటి వ్యాపార సంస్థలు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పట్టణ అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ నిర్వాహకులు రవీందర్ కామప్ప, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





## దాసరి తిరుపతమ్మ భౌతిక కాయనికి నివాళ్ళు అర్పించిన కాంగ్రెస్ నాయకులు

తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3



ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ బుర్రా మహేష్ అమ్మమ్మ దాసరి తిరుపతమ్మ (103) అనారోగ్యం కారణంగా నిన్న రాత్రి వారి స్వగృహం గుర్రాలపాడు నందు తుది శ్వాస విడిచిన విషయం స్థానిక నాయకుల ధ్వారా తెలుసుకొని గుర్రాలపాడు వెళ్లి తిరుపతమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి అంజలి ఘటించి నివాళ్ళు అర్పించి, వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు నూకల రామ్మోహన్ రెడ్డి,భూక్యా సురేష్ నాయక్. ఈ సందర్భంగా వారితో పాటు మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్లపూడి భద్రకాళి,మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు కోర్ని సీతరాములు, నాగరాజు, నాగేశ్వరావు, కళ్లెం శేషి రెడ్డి, భుజంగ రెడ్డి, కొత్తా ఉపేందర్ రెడ్డి,భద్రా చారీ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లి మూడో వార్షికోత్సవం దుర్గామాతకు బోనాలు

**-ప్రత్యేక పూజలు పాల్గొన్నారు ఆవుల రాజిరెడ్డి**



వెల్దుర్తిమండల ప్రతినిధి, ఏప్రిల్ 03 (తెలంగాణ పత్రిక):

వెల్దురి మండల పరిధి బండ పోసానిపల్లి పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లికి మూడో వార్షికోత్సవ సందర్భంగా కళ్యాణ మహోత్సవం ముదిరాజులు శు క్రవారం నిర్వహించారు అమ్మవారికి ప్రత్యేక పూజలు ఒడిబియాలు సమర్పించారు. దుర్గామాతకు బోనాలు నిర్వహించారు నరసాపూర్ నియోజకవర్గ ఆవుల రాజిరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు గ్రామస్తులు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకుంటున్నారు. ముదిరాజుల సంఘం అధ్యక్షుడు విగ్నేష్ గ్రామ సర్పంచ్ నరేందర్ రెడ్డి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మహేష్ రెడ్డి అన్వేష్ నర్సింహారెడ్డి సుధాకర్ గౌడ్ శంకర్ గౌడ్ ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు..

## శివాజీ మహారాజ్ విగ్రహ నిర్వహణ కరపత్రం ఆవిష్కరణ

మిర్యాలగూడ ప్రతినిధి//ఏప్రిల్ 03:(తెలంగాణ పత్రిక)



శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్వహణకు సంబంధించిన కరపత్రాలు పట్టణం లోని వాసవి నగర్లో గల ఎస్ పి ఆర్ స్కూల్ నందు హిందూ వాహిని ఆధ్వర్యంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సమావేశానికి ఆర్ఎస్ఎస్ జిల్లా క్యార్య విభాగ్ నాగరాజు, విభాగ్ భౌతిక్ ప్రముక్ జనార్ధన్, పాల్గొని మాట్లాడుతూ శక్తి సమాజంలోనే హిందూ సమాజ చైతన్యం సాధ్యమవుతుందని, శివాజీ మహారాజ్ స్ఫూర్తితో నేటి యువత ఆదర్శంగా తీసుకొని విగ్రహ ధర్మరక్షణకు కంకణ బద్దులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విగ్రహ కమిటీ అధ్యక్షులుగా గంట సంతోష్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ కార్యదర్శిగా కరుణాకర్ కోశాధికారిగా సత్యనారాయణ ను ఎన్నుకున్నారు. అనంతరం ఈనెల 5 ఆదివారం ఉదయం కూర్చున్న గాంధీ బొమ్మ అశోక్ నగర్ లో జరిగే హిందూ సమ్మేళనంలో కుటుంబ సమేతంగా పాల్గొనాలన్నారు. హిందూ వాహిని కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేపాల పురుషోత్తం రెడ్డి, ఉమాకర్ రెడ్డి, శ్రీనివాస్, సోమలింగం, సుధాకర్, రమేష్, బంటుగిరి, వెంకటేశ్వర్లు, నరేందర్, హిందూ వాహిని ప్రముఖులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమరయ్య జయంతిలో పాల్గొన్న దోమకొండ సర్పంచ్ నరసయ్య, మాజీ జెడ్పిటిసి తిరుమల్ గౌడ్

కామారెడ్డి, ఏప్రిల్ 3, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లాదోమకొండ మండల కేంద్రంలో శు క్రవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ముత్యంపేట రోడ్డు క్రాసింగ్ వద్ద ఉన్న దొడ్డి కొమరయ్య విగ్రహానికి సర్పంచ్ నరసయ్య, మాజీ జెడ్పిటిసి తిరుమల్ గౌడ్, కురుమ సంఘం అధ్యక్షుడు నాగ నాగరాజు పూల దండలు వేసి, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్, వార్డ సభ్యులు పాలకుర్తి శేఖర్, నేతుల బాలమణి, కాంగ్రెస్ నాయకులు నల్లపు శ్రీనివాస్, షమ్మీ, నయీం, నేతుల సుధాకర్, పేతురు మల్లేశం, గూని కొమరయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన తిమ్మాయ్య గారి సుభాష్ రెడ్డి



కామారెడ్డి, ఏప్రిల్ 3, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం పెద్ద మల్ల రెడ్డి సింగిల్ విండో మాజీ చైర్మన్ రాజ గౌడ్ తల్లి మృతి చెందడంతో శుక్రవారం బాధిత కుటుంబాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త తిమ్మయ్య గారి సుభాష్ రెడ్డి పరామర్శించారు ఆయన వెంట జనగాం సర్పంచ్ మట్ట శ్రీనివాస్ దోమకొండ సింగిల్ లో మాజీ చైర్మన్ నాగరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేశం మొత్తానిది ఒక దారి

# వైసీపీది మరో దారి సీఎం చంద్రబాబు

తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

అమరావతికి చట్టబద్ధత కల్పించడం ప్రజల విజయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు(CM Chandrababu Naidu) అన్నారు. శుక్రవారం సీఎం మీడియాతో మాట్లాడుతూ. వైసీపీ అమరావతిని నాశనం చేయాలని చూస్తే తాము శాసనం చేశామని చెప్పుకొచ్చారు. పార్లమెంట్ ఉభయ సభల్లోనూ అమరావతికి చట్టబద్ధత లభించడం ప్రజా విజయమన్నారు. రెండు సభల్లోనూ 35 మంది వరకు ఎంపీలు అమరావతికి మద్దతుగా మాట్లాడారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు 5 కోట్ల మంది ప్రజల తరపున సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. దేశం మొత్తానిది ఒక దారైతే. తమదో దారి అన్నట్లు వైసీపీ వ్యవహరించిందని సీఎం విమర్శించారు. రాష్ట్రం, దేశం నాశనమైనా పర్వాలేదు. తమకు స్వార్థ రాజకీయమే ముఖ్యమన్నట్లుగా వైసీపీ వ్యవహరించిందని ఆరోపించారు.

**-తెలంగాణకు వ్యతిరేకం కాదు...**

తెలంగాణ తన బ్రెయిన్ చైల్డ్ అని.. తెలుగుదేశం పార్టీని అక్కడే స్థాపించినట్టు సీఎం తెలిపారు. తెలంగాణకు తాను వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ విషయంలో ఏడు మండలాలను ఏపీలో కలిపితేనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. తనకున్న అనుభవం, కేంద్ర సహకారంతో ఆ ఏడు మండలాలు ఏపీలో కలిశాయని తెలిపారు. ఆ ఏడు మండలాలు కలిపితేనే పోలవరం సాకారమవుతుందని కేంద్రం గుర్తించిందన్నారు.

**-ఆనాడు వైసీపీ సమర్థించింది...**

శివరామకృష్ణన్ కమిటీ నివేదిక ఆధారంగా గుంటూరు విజయవాడ మధ్య రాజధాని ఉంటే బాగుంటుందని అందరూ అన్నారని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రం మధ్యలో ఉన్న ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ ప్రాంతానికి రాజకీయ, సాంస్కృతిక ప్రాధాన్యం ఉందన్నారు. సమృద్ధిగా నీరు, సారవంతమైన భూములు ఉన్నాయని చంద్రబాబు వివరించారు. ఆనాడు అసెంబ్లీలో వైసీపీ కూడా రాజధానిని సమర్థించిందని. కనీసం 30 వేల ఎకరాలు ఉండాలని జగన్ చెప్పారని తెలిపారు. గుంటూరు విజయవాడ మధ్యలోనే రాజధానిని ఏర్పాటు చేయాలని ఆనాడు జగన్ అన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తుచేశారు.




**-పైసా తీసుకుకోకుండా**

'నా చేతిలో డబ్బులు లేవు.. కానీ నూతన రాజధాని నిర్మించాలనే సంకల్పం ఉంది' అని సీఎం చెప్పారు. భూ సమీకరణ విధానం ప్రకటించిన వెంటనే రైతులు ముందుకు వచ్చి కేవలం నమ్మకం మీదనే నయా పైసా తీసుకోకుండా 34 వేల ఎకరాలు త్యాగం చేశారని సీఎం గుర్తు చేశారు. 11 నెలల్లో సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు నిర్మించామని తెలిపారు. తాను ట్రాన్సిట్ సచివాలయం అన్నా వైసీపీ దాన్ని కూడా రాద్ధాంతం చేసిందని. అంటే వాళ్ల నైజం ఏమిటో అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. అమరావతికి పవిత్రత ఉందని, అన్ని పవిత్ర దేవాలయాల నుంచి మట్టి, నీరు తీసుకొచ్చి అమరావతిని పునీతం చేశామని చంద్రబాబు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా పార్లమెంట్‌లో మట్టి, యమునా నది నుంచి నీరు తీసుకొచ్చారని గుర్తు చేశారు.

**-భగవంతుడు రెండు అవకాశాలిచ్చారు...**

'నేను ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాను... వైసీపీ మాత్రం కుట్రలు చేస్తూ ముందుకు వెళ్లింది. స్మశానం, ఎడారి అని, నిర్మాణాలకు పనికిరాదని ప్రచారం చేసింది. ప్రపంచ బ్యాంకుకు ఉత్తరాలు రాశారు. వరద వస్తే మునిగిపోతుందని భయపెట్టారు. మూడు రాజధానులు అని మూడు ముక్కలాట ఆడారు' అని విమర్శించారు. తన రాజకీయ జీవితంలో ఇటువంటి వారిని ఎప్పుడూ చూడలేదన్నారు. అయినా 2024 ఎన్నికల్లో ప్రజలు తిరుగులేని తీర్పు ఇచ్చి అమరావతే రాజధాని అని స్పష్టం చేశారని తెలిపారు. భగవంతుడు తనకు రెండు అవకాశాలు ఇచ్చారని... హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు సైబరాబాద్‌ను యాడ్ చేశానని.. ఇప్పుడు అమరావతిని తీర్చిదిద్దే బాధ్యత వచ్చిందని అన్నారు. వైసీపీ అమరావతి బ్రాండ్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేసిందని విమర్శించారు. అమరావతి బాండ్లు రెండు గంటల్లో అమ్ముడుపోయాయని.. అంటే అమరావతి బ్రాండ్‌కు ప్రపంచవ్యాప్తంగా ఎంత ఆదరణ ఉందో అర్థమవుతోందని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

**-స్వీట్స్ తినిపించిన సీఎం..**

అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై సీఎం చంద్రబాబును మీడియా ప్రతినిధులు అభినందించారు. ఇది చాలా గర్వించదగిన క్షణాలని, అమరావతి అంటే ఎమోషన్ అని సీఎం అన్నారు. ఆనందంలో తాను కూడా స్వీట్ తింటానని చెప్పి స్వీట్ తిన్నారు సీఎం. అందరికీ స్వయంగా సీఎం చంద్రబాబు స్వీట్స్ ఇచ్చారు.

# తప్పుచేసే పోలీసులను ప్రశ్నించడం తప్పా -పేర్ని నాని

తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

మచిలీపట్నం కొబ్బరితోటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత ఘటనలో పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే కారణంగా రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని నానిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. అయితే.. దీనిపై పేర్ని నాని స్పందించారు. గురువారం జరిగిన ఈ ఘటనపై జిల్లా పోలీస్ అధికార సంఘం అధినేత జయపాల్.. ప్రెస్‌మీట్లో మాట్లాడిన విధానాన్ని తప్పుబట్టారు. నిన్న జరిగిన సంఘటనకు సంబంధించిన వీడియోను చూసి జయపాల్ మాట్లాడిఉంటే బాగుండేది. అక్కడ జరిగిన సంఘటన ఏమిటి? ఆయన ప్రెస్ మీట్లో మాట్లాడిందేమిటి.? వైసీపీ తరపున శాసనసభ ఎన్నికల్లో పోటీచేసిన వ్యక్తి పేర్ని కిట్టు. ఆయనతో పాటు కార్పొరేటర్లు వచ్చి అండగా నిలబడ్డారు. గత ప్రభుత్వంలో ఏ పేదవాని ఇంటినీ మేం కూల్చలేదు. కానీ మున్సిపల్ అధికారులు ఇప్పుడు కొబ్బరితోటలను కూల్చడం ప్రారంభించారు. గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలని తెలిపారు.. బాగుంది. కానీ అక్కడ ఏం జరిగిందో జయపాల్ తెలుసుకోకుండా.. బాడీ షేమింగ్ చేశారని ఎలా మాట్లాడారు? అసలు ఆ సీఐని మేమెక్కడా ఉదహరించలేదు. ఆయన పేరుతో ఏమీ అనలేదు. అయినా ఏకవచనంతో మీరు మాట్లాడవచ్చా' అని పేర్ని నాని ప్రశ్నించారు. 'నా మీద, నా కొడుకు మీద అక్రమ కేసులు కట్టారు. కేవలం పబ్లిసిటీ కోసం ఎవరు ఎదిగారు? ఎవరు ఆరాటపడుతున్నారు జయపాల్.. నాకు రాజకీయ పబ్లిసిటీ దేనికి నేను ప్రజలకోసం పోరాటంచేసే వ్యక్తిని? కొందరు పోలీసులు భయంలేకుండా తప్పులు చేస్తున్నారు. మీలా అందరూ మంచి వ్యక్తులు లేరు. పోలీస్ వ్యవస్థ మారింది. పోలీసులు మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకుని పనిచేస్తే అప్పుడు ప్రజలకు పోలీసులతో అవసరమేమీ ఉండదుగా.!' అని వ్యాఖ్యానించారు మాజీ మంత్రి. రెడ్‌బుక్ రాజ్యాంగం రాగానే పామర్రులో ఓ అధికారికి ఎందుకు పోస్టింగ్ ఇచ్చారని ప్రశ్నించిన ఆయన.. ఆ తర్వాత మళ్లీ నాలుగు జిల్లాల అవతలికి ఎందుకు పంపారన్నారు. పోలీస్ వ్యవస్థలో తప్పుచేసిన కొందరు అధికారులను ప్రశ్నించడం తప్పా అని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు పేర్ని నాని. మంత్రి కొల్లు రవీంద్ర ఎన్నోసార్లు పోలీస్ అధికారులను తిట్టారుగా. అప్పుడీ పోలీస్ జిల్లాధ్యక్షుడికి(జయపాల్‌ను ఉద్దేశించి) కనపించలేదా. మరప్పుడెందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. 'పోలీసులు సుదీర్ఘ కాలం పనిచేస్తారు. కానీ ఎక్కడా ఎక్కువ కాలం ఉండరు. పవిత్రమైన యూనిఫామ్ వెనుక తప్పుచేసే అధికారిని మాత్రమే మేం ప్రశ్నించాం. అంతేతప్ప నేనెప్పుడూ ఏ పోలీస్ అధికారినీ ఉద్దేశపూర్వకంగా అనలేదు. తప్పుచేసే వ్యక్తులను నిలదీయడం మీ దృష్టిలో తప్పా' అని చెప్పుకొచ్చారు.




# అమరావతికి ఆమోదంపై సంబరాలు

తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

రాష్ట్ర రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ పార్లమెంట్ ఉభయసభ లలో బిల్లు ఆమోదం పొందడంతో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వినాయక సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి బాణాసంచా పేల్చి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతూ అమరావతిని శాశ్వత రాజ ధానిగా పార్లమెంట్‌లో తీర్మానం చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉభయసభల్లో రాజధాని బిల్లును సమర్థించలేని వైసీపీ రాష్ట్రంలో రాజకీయం చేసే హక్కు కోల్పోయిందని అన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం లో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిప ల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండి క్రిష్ణమూర్తి, కన్వీనర్లు కురుబ హనుమంతు, కాలవ సన్నన్న, బిజేపీ నాయకురాలు జింకా వసుంధర, టంకశాల హనుమంతు, పైతోట అంజి, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, కళ్యాణదుర్గం నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండలకేంద్రాలు, పలు గ్రామాల్లో టీడీపీ స్థానిక నాయకులు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. బైక్ ర్యాలీలు నిర్వహించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు.



## జగన్.. అమరావతిని ఇంచు కూడా కదపలేరు: గంటా శ్రీనివాసరావు




తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

పార్లమెంట్‌లో అమరావతి రాజధాని బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు(MLA Ganta Srinivas Rao). ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి (YS Jagan Mohan reddy) వివిధ సందర్భాల్లో రాజధాని గురించి మాట్లాడిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే విడుదల చేశారు. అమరావతిపై జగన్ మాట్లాడిన మాటలు చూస్తే ఆయన మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. అమరావతిపై జగన్‌లా ఇన్ని ప్రకటనలు చేసిన వ్యక్తి ప్రపంచంలో మరెవరూ ఉండరంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు.ప్రతిపక్ష నాయకుడిగా అమరావతిని అంగీకరించారని.. గెలిచిన తర్వాత మూడు రాజధానులు అన్నారని గంటా శ్రీనివాస్ తెలిపారు. అమరావతి తీర్మానంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశానికి కూడా హాజరుకాలేదన్నారు. పార్లమెంట్‌లో అమరావతికి వ్యతిరేకంగా ఉన్న ఏకైక పార్టీ వైసీపీ అని తెలిపారు. మొన్నటి వరకు ఉత్తరాంధ్ర అన్న జగన్.. ఇప్పుడు మావిగన్ అని అంటున్నారని అన్నారు. మాజీ సీఎంకు ఏ అంశంపైనా ఒక స్థిరమైన అభిప్రాయం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. వైసీపీకి 151 సీట్ల నుంచి 11 సీట్లకు ప్రజలు తీర్పు ఇచ్చినా జగన్ మారడం లేదన్నారు ఎమ్మెల్యే. ఏప్రిల్ 15వ తేదీ లోపు గూగుల్ శంకుస్థాపన చేయొచ్చని వెల్లడించారు. అమరావతి కలల రాజధానిని సాధించుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం అమరావతి ప్రజలను ఎన్ని ఇబ్బందులు పెట్టిందో అంతా చూశారన్నారు. రాష్ట్రపతి ఆమోదంతో జగన్ రాజధాని అమరావతిని ఇంచు కూడా కదపలేరని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# మి'రప్పా రప్పా' ఎప్పుడో ?

**-మిరప రైతులను వెంటాడుతున్న కష్టాలు**

**-దిగుబడిపై తెగుళ్లు, మొంథా తుఫాను ప్రభావం**

**-మూడు నెలల్లోనే రూ.30 వేలు తగ్గిన ధర**

తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

మిరప రైతుల కష్టాలు తీరడం లేదు. దిగుబడి ఉంటే ధర ఉండదు. ధర ఉన్నప్పుడు



దిగుబడి ఉండదు. దీంతో సాగు చేసిన రైతులకు ఏటా నష్టాలు తప్పడం లేదు. ఉరవకొండ నియోజకవర్గంలో పుష్కర కాలం నుంచి మిరప సాగు గణనీయంగా పెరిగింది. హెచ్చెల్సీ, జీబీసీ, హంద్రీనీవా కాలువలతో పాటు బోరుబావుల కింద సుమారుగా 30వేల ఎకరాల్లో మిరపసాగు అయ్యింది. ఈ ఏడాది ఇప్పటికే 80శాతం పైగా పంట రైతుల చేతికి వచ్చింది. నల్లతామర, తెగుళ్లతో పాటు, మొంథా తుఫాన్ కూడా దిగుబడిపై ప్రభావం చూపింది. నవంబరు, డిసెంబరు నెలలో అననుకూల వాతావరణ పరిస్థితుల వల్ల పంటను కాపాడుకునేందుకు రైతులు రోజు మార్చి రోజు మందులను పిచికారీ చేశారు. దీంతో ఖర్చు తడిసి మోపెడయ్యింది. మూడు నెలల కిందట డబ్బీ రకం క్వింటా రూ.85వేలు పలకగా ప్రస్తుతం రూ.55వేల నుంచి, రూ.65వేల మధ్య నడుస్తోంది. దిగుబడిని విక్రయించేందుకు రైతులు పొలాల్లోనూ, మార్కెట్ యార్డులో నిల్వ చేసుకుని వ్యాపారుల కోసం ఎదురుచూస్తున్నారు.

**-రూ.లక్షల్లో పెట్టుబడి**

దుక్కిదున్నడం, విత్తనాలు, మొక్కలు నాటిన కూలితో పాటు, ఎరువులు, పురుగుమందులు, పంటకోత కూలీలకు ఇలా ఎకరా విస్తీర్ణంలో మిరప సాగుకు మొత్తం పెట్టుబడి రూ.1.5లక్షలు పెట్టారు. కౌలు రైతులు అయితే మరో రూ.50వేలు అదనంగా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ఎకరాకు సాధారణంగా 18 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి రావాలి. ఈసారి 8 నుంచి 10 క్వింటాళ్ల మాత్రమే వచ్చింది. దీంతో ధర ఓ మోస్తరుగా ఉన్నా దిగుబడి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచి ధర వచ్చే వరకు పంట దిగుబడులను నిల్వ చేసుకోవడానికి అవకాశాలు లేక రైతులు పొలాల్లో చెట్ల కిందే రాశులుగా పోశారు. సాధారణంగా మిరప దిగుబడులను శీతల గిడ్డంగులలో నిల్వ చేయాలి. అలాంటి సదుపాయం జిల్లాలో ఎక్కడా లేదు. ఒక వేళ నిల్వ చేయాలంటే బ్యాడిగి, బళ్లారి, గుంటూరు ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుంది. అదంతా మరింత వ్యయప్రయాసలతో కూడిన పని. జిల్లాలోనే ఏదో ఒక మార్కెట్‌లో శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

**-అమ్మాలంటే కర్ణాటకకు వెళ్లాలి**

నాలుగున్నర ఎకరాల్లో పంట సాగుచేశా. ఎకరాకు రూ.2లక్షల దాకా పెట్టుబడి పెట్టాం. గత ఏడాదితో పోలిస్తే దిగుబడి కొంత పెరిగింది. క్వింటా ధర రూ.55వేలకు మించి అడగడం లేదు. తుఫాను, తెగుళ్ల దిగుబడిపై ప్రభావం చూపాయి. పండిన పంటను అమ్ముకోవాలంటే కర్ణాటకకు వెళ్లాల్సి వస్తోంది.

**- కిష్టప్ప, రైతు, ఉరవకొండ**

**-జనవరిలో మంచి ధర**

జనవరిలో డబ్బీ ధర రూ.80 వేల నుంచి రూ.90వేల దాకా పలికింది. 20 రోజుల్లోనే ధర భారీగా పడిపోయింది. ఇప్పుడు రూ.50వేలు పలుకుతోంది. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. చేసిన కష్టమంతా పెట్టుబడికే సరిపోతుంది. ఈ ఏడాది నల్లితెగులుతో పెట్టుబడి మరింత పెరిగింది.

# హుజురాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో బంద్ విజయవంతం

-బంద్ విజయవంతం అన్ని వర్గాల సంపూర్ణ మద్దతు

-డంపింగ్ యార్డ్ ఏర్పాటు వెంటనే ఉపసంహరించుకోవా

తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ ఏర్పాటు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పాడి కౌశిక్ రెడ్డి మరియు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. హుజురాబాద్ పట్టణంలోని వ్యాపార, వాణిజ్య రంగాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హుజురాబాద్ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే ప్రజలు తీవ్రమైన అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. దేశానికి నాణ్యమైన విత్తనాలను అందించే ఈ ప్రాంతంలోని వ్యవసాయ భూములు నాశనం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, లేదంటే భవిష్యత్తులో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 7, 8 తేదీల్లో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమంలో రెండు రోజుల పాటు



పాల్గొంటానని తెలిపారు. బంద్‌కు సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు మహా గర్జన సమర భేరి సభ పోస్టర్ను ఆవిష్కరించిన మాజీ మంత్రి హరీష్ రావు





తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

అన్న దాతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రైతుల డిమాండ్ల సాధనకు 2లక్షల మందితో సమరభేరి రైతు ప్రజాసంఘాల జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి స్వామి రెడ్డి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు. డిమాండ్ల సాధనకు ఈనెల 28 న కరీంనగర్ లో 2 లక్షల మందితో ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్ర స్థాయి రైతుల మహాగర్జన సమరభేరి సభను నిర్వహిస్తున్నట్లు రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ . ఉమ్మడి మెదక్. రంగారెడ్డి జిల్లాల రైతు ప్రజాసంఘాల నాయకుల తో కలిసి శు క్రవారం రోజున రైతు ప్రజాసంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు హైదరాబాద్ లో మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు.వీ.శ్రీనివాస్ గౌడ్. సుద్దాల దేవయ్య.రావుల చంద్రశేఖర్ రెడ్డి మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాజీ ఎమ్మెల్యేలు వివిధ హోదాల్లో ఉన్న తాజా మాజీ ప్రజాప్రతినిధులను కరీంనగర్ లో ఈనెల 28 న అన్నదాతలకు వివిధ సామాజిక వర్గాల కు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ రైతు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి రైతుల మహా గర్జన సమర భేరి సభకు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలను అందజేసి వారిచే రైతుల మహాగర్జన సభ గోడ ప్రతులను రామారావు ఆవిష్కరింప జేశారు. సభకు తాము సంపూర్ణ సహకారం అందిస్తామని తాము స్వయంగా సభకు హాజరవుతామని ప్రకటించిన మాజీ మంత్రులకు వివిధ జిల్లాల నాయకులకు రైతు ప్రజాసంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాలకులు రైతు ప్రభుత్వాలని చెప్పుకోవడం తప్ప వారిని ఆదుకోవడం లో తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ రైతాంగానికి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతుండటం వాంఛనీయం కాదన్నారు. ముఖ్యంగా కౌలు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని. రెండు లక్షల ఋణ మాఫీ లో కేవలం 30 శాతం మందికి మాత్రమే మాఫీ కాగా మిగతా 70 శాతం మంది రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని సాగు సమయంలోనే రైతు భరోసా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాల ఉత్పత్తి దారులకు గతంలో లీటరు కు 4 రూపాయల రాయితీ ఇవ్వగా నేటి ప్రభుత్వం ఇవ్వడం లేదని ఆరోపించారు ఇచ్చిన హామీల మేరకు కేవలం సన్న రకాలకే కాకుండా అన్ని రకాల పంటలకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ను ధాన్యపు కొనుగోళ్ల సమయం లోనే చెల్లించాలని డిమాండ్ చేశారు మొత్తం 12 డిమాండ్ల తో ప్రభుత్వాలను కళ్ళు తెరిలించేలా కరీంనగర్ లో లక్షలాది మంది తో రాజకీయాల కతీతంగా సమరభేరి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు ప్రజాసంఘాల అధ్యక్షుడు గూడూరి స్వామి రెడ్డి. వివిధ జిల్లాల ప్రజా సంఘాల నాయకులు నదిపెల్లి వెంకటేశ్వర్ రావు.హంస కేతన్ రెడ్డి చకిలం రమణయ్య.వన్నాల విష్ణు వర్ధన్ రెడ్డి నరేష్ యాదవ్. మంద గల్ల నగేష్. కవ్వంపల్లి అనిల్. మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ ను వెంటనే రద్దు చేయాలి

తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

హుజురాబాద్ డివిజన్ మస్జిద్, ఈద్గా & ఖబ్రస్తాన్ అధ్యక్షుల అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ డిమాండ్ సిర్సపల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టిన డంప్ యార్డ్‌ను తక్షణమే రద్దు చేయాలని హుజురాబాద్ మండలంలోని చెల్పూర్ మస్జిద్ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ డిమాండ్ చేశారు, డంప్ యార్డ్ ఏర్పాటు వల్ల వాయు కాలుష్యం, జల కాలుష్యం, పంటలు వేయడానికి వీలు లేకుండా భూమి కాలుష్యం, విషపూరిత వాయువుల వల్ల ప్రమాదకర వైరస్‌ల వ్యాప్తి వంటి సమస్యలు ఏర్పడి హుజురాబాద్ మండల పరిధిలో గల ప్రజల జీవనం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు, డంప్ యార్డ్ వల్ల ప్రజలు తీవ్రమైన వ్యాధులకు గురి అవుతారని, కరోనా కంటే ప్రమాదకరమైన వైరస్‌లు వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిపారు. పచ్చని హుజురాబాద్‌ను నాశనం చేయొద్దని, హుజురాబాద్ ప్రజల మనోభావాలను గౌరవిస్తూ ప్రభుత్వం వెంటనే డంప్ యార్డ్ రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, కరీంనగర్ ఇన్చార్జి



మినిస్టర్ తుమ్మల నాగేశ్వరరావు కు, ఐటి శాఖ మాత్యులు శ్రీధర్ బాబు కు, బీసీ రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ కు, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రణవ్ బాబుకు విజ్ఞప్తి చేశారు ఒకవేళ ప్రభుత్వం డంప్ యార్డ్ రద్దు చేయని పక్షంలో రానున్న రోజుల్లో హుజురాబాద్ మండలంలోని ముస్లింలతో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో ఇస్మాయిల్, అంకూస్, అప్సర్, మెరాజ్, రహీం, సమీర్, వజీర్, వాజిద్, చాంద్ పాషా, అన్సారీ, షాను, అన్ను, షారుక్ మహమూద్, దస్తగిరి, హబీబ్ పాషాబబ్లూ, సోహెల్, సోహెబ్, రఫీక్, ఆఫ్రోజ్, అహ్మద్, సాజీత్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ సలహాదారు నరేందర్ రెడ్డిని కలిసిన ప్రణవ్

-డంప్ యార్డ్ ప్రతిపాదన హుజూరాబాద్ నుండి వెనక్కి తీసుకోండి.

- వారంలో రెండోసారి ఈ విషయంపై చర్చ..

తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3



హుజూరాబాద్ పట్టణ పరిధిలోని సిర్సపల్లి శివారులో నిర్మించ తలపెట్టిన డంప్ యార్డ్ ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారు,రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ ని కలిసి దాని వల్ల వచ్చే అనర్థాలను,ఇతర ప్రాంతాలకు తరలిస్తే ప్రజలకు ఎంత ఉపయోగమో వివరించారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.ఈ ప్రాంతం వ్యవసాయానికి మూలాధారమని ప్రజల మనోభావాలు అర్థం చేసుకొని, ఈ వేస్ట్ టు ఎనర్జీ యార్డుతో జనాలతో పాటు,వాటి వ్యర్థాల వల్ల పంట పొలాలకు కూడా ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు.జనావాసాల మధ్య కాకుండా వేరేచోటుకి దీన్ని మార్చాలని కోరారు.ఈ విషయమై ఇప్పటికే వారంలో రెండవ సారి కలిశామని దీనిపై ఎలాంటి ముందుకు వెళ్లొద్దని,సీఎం దృష్టికి ఈ విషయం తెలపాలని కోరారు.సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈ విషయమై చర్చిస్తామని భరోసా కల్పించారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్థిక సహాయం రూ. ఏడు లక్షలకు పెంచాలి.

-మొదటి విడత లబ్ధిదారుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి.

-బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్.



తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లుల పథకంలో లబ్ధిదారులకు అందిస్తున్న ఐదు లక్షల రూపాయల సహాయం సరిపోవడం లేదని, ఇట్టి ఆర్థిక సహాయాన్ని ఏడు లక్షల రూపాయలు పెంచాలని బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు, పేదలకు ఇళ్ల కోసం ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక సహాయం గొప్ప వరమని అయినప్పటికీ ప్రస్తుత మార్కెట్ లో గృహ నిర్మాణ వస్తువుల ధరలు అధికంగా పెరిగాయని తద్వారా లబ్ధిదారులకు ఖర్చులు పెరిగాయని, ప్రభుత్వం నియమించిన కొలతల ప్రకారం కట్టడానికి ఇబ్బందులు పడుతున్నారని, ఆ కారణంగా అప్పుల పాలు అవుతున్నారని, అట్టి విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పేదలకు ఇళ్ల కోసం ఆర్థిక సహాయాన్ని 7 లక్షలు పెంచాలని డిమాండ్ చేశారు.మొదటి విడత లబ్ధిదారుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్ హుజురాబాద్ మండలం అధ్యక్షుడు నడిగోటి రమేష్ ప్రధాన కార్యదర్శి మమునూరి ప్రవీణ్ ఉపాధ్యక్షుడు కొల్లిపాక క్రాంతి కుమార్ ప్రచార కార్యదర్శి పంజాల వెంకటేశ్వర్లు గౌడ్ కందుకూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ సిఎస్ఐ చర్చిలో సిలువ ధ్యానాల పండుగ చాలా ఘనంగా నిర్వహించారు



తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

దేవుని నామానికి స్తోత్రములు ఈరోజు హుజరాబాద్ సిఎస్ఐ చర్చిలో రెవరెండ్ ఈసంపల్లి జాన్ బాబు పాస్టర్, ఆధ్వర్యంలో సిలువలో ఏసుక్రీస్తు ప్రభులవారు పలికిన ఏడు మాటలు స్థానిక హుజురాబాద్ సిఎస్ఐ చర్చిలో సిలువ ధ్యానాల పండుగ చాలా ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఫాస్ట్ రేట్ చైర్మన్ రెవరెండ్ ఈ జాన్ బాబు వాక్య సందేశము వినిపించారు ఈ కార్యక్రమంలో ఫాస్ట్రేట్ ఉమెన్స్ చైర్మన్ విజయ అమ్మ, మరియు ఫాస్ట్రేట్ సెక్రటరీ సొల్లు బాబు గూడెపు రవీందర్ ఎస్ మహేందర్ అమర్లపూడి శరన్ కుమార్ వై రవికుమార్ సొల్లు సునీత జి సురేఖ జి హిమవంతు వై పుష్పలత ది రాణి బాబు అలాగే కడారి అనుష శంకర్ ఆర్ ప్రమోదిత స్వామి దాస్ బి కనకలక్ష్మి ఏ ప్రభావతి ఏ ప్రియాంక కే సబిత కే రాజేశ్వరి ధరణి కె రజిత సంపత్ జి కాంతా ఎన్ పద్మ ఎన్ ఝాన్సీ ప్రియ కె శైలజ ఏ శ్రీలత రంజిత్ కుమార్ ఎస్ స్రవంతి ఈ బ్యూలా కె సుశీల కే సుకన్య టి లలిత కే ఆశీర్వాద ఏ ఏలియా నీలమ్మ ఆకునూరి అర్చన సిద్ధూ చర్చిలో వందలాది భక్తులు పాల్గొన్నారు ప్రార్థనలు చేశారు.

## ఇరాన్‌పై ఇంకా దాడులెందుకు?

**–ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్**



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు ఇంకా దాడులు ఎందుకు కొనసాగిస్తున్నాయని ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ ప్రశ్నించారు. ఇరాన్ వద్ద అణు బాంబులు ఉండరాదన్న ఉద్దేశంతో దాడులు ప్రారంభించి, ఆ దేశ అణు కార్యక్రమ మౌలిక వసతులన్నీ ధ్వంసం చేసిన తర్వాత ఇంకా ఎందుకు యుద్ధం కొనసాగిస్తున్నారో అర్థంకావటం లేదని గురువారం ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌లో దాడులు చేయటానికి ఇంకా ఏం మిగిలిందని ప్రశ్నించారు. యుద్ధం ఇలాగే కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలోకి కూరుకుపోతుందని హెచ్చరించారు.

## విషాదం రీల్స్ చేయడానికి వెళ్లి నదిలో మునిగి




తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లా రాణిదిహా గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. సరదాగా రీల్స్ చేసేందుకు రాప్తి నదికి వెళ్లిన ఐదుగురు విద్యార్థులు నదిలో మునిగిపోయారు. వారిలో ఒక విద్యార్థి ఒడ్డుకు చేరుకోగా.. మిగిలిన నలుగురు నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు బాలురు ఇలా అకస్మాత్తుగా మరణించడంతో రాణిదిహా గ్రామం మొత్తం శోకసముద్రంలో మునిగిపోయింది. రాణిదిహా గ్రామానికి చెందిన ఐదుగురు స్నేహితులు బుధవారం మధ్యాహ్నం రాప్తి నది సమీపంలో రీల్స్ చేసుకోవడానికి వెళ్లారు. అమన్ (15), వివేక్ నిషాద్(15) గగన్ పాశ్వాన్(15), అనికేత్ యాదవ్(13)లతో పాటు వారి స్నేహితుడు రాజకరణ్ తమ సైకిళ్ళపై విన్యాసాలు చేస్తూ, వీడియోలు తీస్తూ మీర్జాపూర్ పిపా వంతెన సమీపానికి చేరుకున్నారు. నదిలో స్నానం చేస్తూ రీల్స్ చేద్దామనుకున్నారు. ఆ ఉత్సాహంతో.. ఐదుగురు స్నేహితులు లోతైన నీటిలోకి దిగారు. అంతలోనే నీటి ఉధృతి పెరిగింది. రాజ్‌కరణ్ ధైర్యంగా ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. మిగిలిన నలుగురు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. స్థానికుల సమాచారంతో పోలీసులు, రెస్క్యూ టీమ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గజ ఈతగాళ్ల సహాయంతో భారీ ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం నలుగురు మృతదేహాలు రాప్తి నదిలో తేలుతూ కనిపించాయి. పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తమ పిల్లల మృతదేహాలను చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. వారి ఆవేదన చూసి గ్రామస్థులు సైతం కంటనీరు పెట్టుకున్నారు.

## అభ్యర్థుల తరపున ప్రచారం చేయడమే నా బాధ్యత: అన్నామలై

తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాలో తన పేరు లేకపోవడంపై బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అన్నామలై స్పందించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల తరపున ప్రచారం చేయడమే తన పాత్ర అని, అది తన బాధ్యత అని చెప్పారు. కన్నూరులో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో అన్నామలై పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతానికి తమిళనాడులో పోటీ చేసే పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం కొనసాగించడమే తనకు అప్పగించిన బాధ్యత అని చెప్పారు. 'ప్రస్తుతం పుదుచ్చేరి, కేరళలో ఈనెల 7వ తేదీ వరకూ ప్రచారం ఉంటుంది. 7వ తేదీ నుంచి 23 వరకూ తమిళనాడులో బీజేపీ, ఎన్డీయే అభ్యర్థులందరి తరపున ప్రచారంలో పాల్గొంటాను. పార్టీ అప్పగించిన బాధ్యత ఇది. దానికి పూర్తి న్యాయం చేస్తాను' అని అన్నామలై చెప్పారు. కన్నూరులో బీజేపీ అభ్యర్థి సి.రఘునాథ్ తరపున ఆయన ప్రస్తుతం ప్రచారం సాగిస్తున్నారు. ఎన్డీయే కూటమితో సంప్రదింపుల అనంతరం తమిళనాడులో పోటీ చేసే 27 మంది అభ్యర్థుల జాబితాను బీజేపీ శుక్రవారం విడుదల చేసింది. తమిళనాడు బీజేపీలో 'సింహం'గా పేరున్న కె.అన్నామలైకి ఈ జాబితాలో చోటులేకపోవడం చర్చనీయాంశమైంది. అయితే అన్నామలై మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ప్రకటించిన అభ్యర్థులకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో అభినందనలు తెలిపారు. డీఎంకేపై విమర్శలు గుప్పించారు. బీజేపీ కార్యకర్తగా బీజేపీ, ఎన్డీయే అభ్యర్థుల విజయానికి పాటుపడతానని చెప్పారు. పార్టీ అభ్యర్థుల జాబితాను కూడా ఆయన తన ట్వీట్‌కు జతచేశారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ఏప్రిల్ 23న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# అమెరికా ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ జార్జ్‌కు ఉద్వాసన

తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశ సైన్యంలోని అత్యున్నత అధికారి అయిన జనరల్ రాండీ ఏ.జార్జ్‌ను పదవీ బాధ్యతల నుంచి తప్పించింది. ఈ మేరకు ఆయన తక్షణమే వైదొలగాలని రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ కోరినట్టు పెంటగాన్ నివేదించింది. అయితే.. ఆయన తొలగింపునకు గల కారణాలను మాత్రం వెల్లడించలేదు. జార్జ్ సేవలకు మేం కృతజ్ఞులం. కానీ సైన్యంలో నాయకత్వ మార్పునకు సమయం ఆసన్నమైంది' అని రక్షణ శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి అన్నారని రాసుకొచ్చింది పెంటగాన్. ప్రస్తుతం.. వైస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అయిన జనరల్ క్రిస్టోఫర్‌ను తాత్కాలిక ఆర్మీ చీఫ్‌గా నియమించింది. హెగ్సెత్ గతేడాది తొలిసారిగా రక్షణ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు సైన్యంలోని ఉన్నతస్థాయి పదవుల్లోని సుమారు డజనుకుపైగా అధికారులను తొలగించడం గమనార్హం. అందులో జార్జ్ ఒకరు. 1988 వెస్ట్ పాయింట్ మిలిటరీ అకాడమీ గ్రాడ్యుయేట్, పదాతిదళ అధికారి అయిన జార్జ్.. అమెరికన్ ఆర్మీ 41వ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్‌గా 2023 సెప్టెంబర్ 21న బాధ్యతలు స్వీకరించారు. అంతకముందు ఆయన 38వ వైస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా.. తొలి గల్ఫ్ యుద్ధంతో పాటు ఇరాక్, అఫ్గానిస్థాన్‌లలోనూ పనిచేశారు. సైన్యంలో బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆయన యూఎస్ మాజీ ప్రెసిడెంట్ బైడెన్ పాలనలో 2021–22 కాలంలో రక్షణ కార్యదర్శి లాయిడ్ ఆస్టిన్‌కు అగ్రశ్రేణి సైనిక సహాయకుడిగానూ సేవలందించారు. ఆపరేషన్ డెసర్ట్ షీల్డ్, డెసర్ట్ స్టార్మ్, ఇరాకీ ఫ్రీడమ్, ఎండ్యూరింగ్ ఫ్రీడమ్ వంటి పలు కీలక ఆపరేషన్లలో పాల్గొన్నారు జార్జ్.




# ఇరాన్ చర్చలకు రాకపోతే మరింత వినాశనాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది: ట్రంప్


తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3



పశ్చిమాసియాలో యుద్ధం మరింత ముదిరింది. ఇరాన్‌లోని అల్బోర్జ్ ప్రాంతంలో గల అత్యంత ఎత్తైన 'B1' వంతెన లక్ష్యంగా అమెరికా – ఇజ్రాయెల్ దళాలు జరిపిన తాజా వైమానిక దాడుల్లో ఎనిమిది మంది మరణించారు. 95 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ దాడిలో సామాన్య పౌరులు పెద్ద సంఖ్యలో బలయ్యారని తెలుస్తోంది. ఉత్తర ఇరాన్‌లోని కరాజ్ నగరంలో ఉన్న ఈ B1 వంతెన.. ఆ దేశంలోని అత్యంత సంక్లిష్టమైన, ఎత్తైన నిర్మాణాలలో ఒకటిగా పేరుగాంచింది. ఈ వంతెనపై వరుసగా రెండుసార్లు క్షిపణి దాడులు జరిగాయి. మొదటి దాడి జరిగిన తర్వాత సహాయక చర్యలు చేపడుతుండగా, రెండవ దాడి జరిగినట్లు సమాచారం. మరణించిన వారిలో స్థానిక గ్రామాల నివాసితులతో పాటు, ప్రకృతి దినోత్సవం (Nature Day) వేడుకల కోసం వంతెన సమీపంలో ఉన్న పర్యాటకులు కూడా ఉన్నారని సమాచారం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ దాడిని ధృవీకరిస్తూ, ఇరాన్ తన పద్ధతి మార్చుకోకపోతే మరిన్ని తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. 'ఇరాన్‌లోని అతిపెద్ద వంతెన కూలిపోయింది, ఇరాన్ చర్చలకు రాకపోతే దేశం మరింత వినాశనాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది' అని ఆయన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. మరోవైపు, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి ఈ దాడులను తీవ్రంగా ఖండించారు. 'పౌర మౌలిక సదుపాయాలపై దాడులు చేయడం శత్రువు నైతిక పతనాన్ని సూచిస్తుంది. ఇలాంటి చర్యలు ఇరానియన్ల ధైర్యాన్ని దెబ్బతీయలేవు' అని ఆయన స్పష్టం చేశారు. అంతేకాదు, 'నిర్మాణంలో ఉన్న వంతెనలు సహా.. పౌర నిర్మాణాలపై దాడులు చేయడం వల్ల ఇరానియన్లు లొంగిపోరు. ఇది కేవలం అయోమయంలో ఉన్న శత్రువు ఓటమిని, నైతిక పతనాన్ని మాత్రమే తెలియజేస్తుంది. ప్రతి వంతెనను, ప్రతి భవనాన్ని అంతకంటే బలంగా తిరిగి నిర్మిస్తాం. కానీ ఒకటి మాత్రం ఎప్పటికీ తిరిగిరాదు.. అది అమెరికా ప్రతిష్టకు కలిగిన నష్టం...' అని అత్యంత ఘాటుగా ఇరాన్ విదేశాంగమంత్రి వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ సందేశంలో పేర్కొన్నారు.

## అప్పుడు నాలుగు పెళ్లిళ్లు చేసుకోలేరు అస్సాం ప్రచారంలో అమిత్‌షా

తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3




చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి (UCC)తో అడ్డుకునే వీలుంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. అస్సాంలోని గోల్‌పాడాలో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమిత్‌షా మాట్లాడుతూ, తిరిగి తాము అధికారంలోకి వస్తే అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. గిరిజనాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సమగ్ర మ్యాప్ సిద్ధం చేశారని అమిత్‌షా తెలిపారు. దీనిని ముందుకు తీసుకువెళ్లి, సమర్థవంతంగా అమలు చేయాలంటే బీజేపీకే ప్రజలు ఓటు వేయాలని కోరారు. మోదీ నాయకత్వంలో తొలిసారి గిరిజన మహిళ దేశ అధ్యక్షురాలు అయిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ ఆదివాసీ మహిళలను రాష్ట్రపతి చేయలేదని, మోదీ వచ్చాక పరిస్థితి మారిందని, ద్రౌపది ముర్ము దేశానికి తొలి పౌరురాలు అయ్యారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. యూసీసీ నుంచి ఆదివాసీ ప్రాంతాలను మినహాయిస్తామని చెప్పారు. పొరుగున్న ఉన్న మేఘాలయాలో చొరబాటుదారులు ఇటీవల గరో హిల్స్ అటానమస్ జిల్లా కౌన్సిల్‌లో గిరిజన మహిళలను పెళ్లాడి రాజకీయ పలుకుబడిని సంపాదించే ప్రయత్నం చేశారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని అమిత్‌షా చెప్పారు. అస్సాంలో తమకు మరో ఐదేళ్లు అధికారం ఇస్తే యూజీసీని అమలు చేయడంతో పాటు చొరబాటుదారుల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అస్సాంలో శాంతిని బీజేపీ పునరుద్ధరించిందని, కాంగ్రెస్ తిరిగి వచ్చినా, కొన్ని సీట్లలో నెగ్గినా కూడా తిరిగి రాష్ట్రంలో అస్థిరత నెలకొంటుందని హెచ్చరించారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## టీవీకే చీఫ్ విజయ్ ఎన్నికల అఫిడవిట్లలో వ్యత్యాసాలు




తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 3

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగడంతో.. అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. వివిధ పార్టీల నుంచి అభ్యర్థులు బరిలోకి దిగి.. తమ నామినేషన్లు దాఖలు చేసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు. టీవీకే పార్టీ చీఫ్ విజయ్ సైతం తన నామినేషన్లు దాఖలు చేశారు. ఈ ఎన్నికల్లో ఆయన.. పెరంబూర్, తిరుచురాపల్లి ఈస్ట్ స్థానం నుంచి ఎన్నికల బరిలో దిగారు. ఈ రెండు స్థానాల్లో దాఖలు చేసిన అఫిడవిట్‌లో వివరాలు వేర్వేరుగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. పెరంబూర్ స్థానానికి సమర్పించిన అఫిడవిట్‌లో తనపై ఎలాంటి కేసులు లేవని విజయ్ స్పష్టం చేశారు. తిరుచురాపల్లి ఈస్ట్ స్థానానికి సమర్పించిన అఫిడవిట్‌లో తనపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు విజయ్ వివరించారని తెలిపారు. 2025లో పెరవల్లూరు పోలీస్ స్టేషన్‌లో విజయ్‌పై నమోదైన కేసును పెరంబూర్ ఫైలింగ్‌లో ఆయన వెల్లడించలేదు. అలాంటి వేళ.. ఈ వ్యత్యాసాలను స్పష్టం చేస్తూ సవరించిన అఫిడవిట్‌ను సమర్పించడం ద్వారా దిద్దుబాటు చర్యలకు ఒక్కటే మార్గమని ఈ సందర్భంగా విజయ్‌కు న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. విజయ్ తన అఫిడవిట్‌లో. తన మొత్తం ఆస్తుల విలువ రూ.603.20 కోట్లు అని స్పష్టం చేశారు. వాటిలో రూ.213 కోట్లకుపైగా బ్యాంక్ డిపాజిట్లు ఉన్నాయని వివరించారు. వాటితో పాటూ అత్యంత ఖరీదైన కార్లు సైతం తనకు ఉన్నాయని.వాటి వివరాలను తన ఎన్నికల అఫిడవిట్‌లో టీవీకే చీఫ్ విజయ్ ప్రకటించారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23వ తేదీన ఒకే విడతలో జరగనున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు మే 4వ తేదీన వెలువడనున్నాయి.

## బిజినెస్

### యాపిల్ 50వ వార్షికోత్సవం: ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ పై భారీ తగ్గింపు




టెక్ దిగ్గజం యాపిల్ తన 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ వినియోగదారులకు ఓ బంపర్ ఆఫర్ ప్రకటించింది. యాపిల్ అధీకృత రీసెల్లర్ అయిన 'ఇమేజిన్ స్టోర్'.. ఐఫోన్, ఐప్యాడ్, యాపిల్ వాచ్ మోడళ్లపై భారీ డిస్కౌంట్లతో ప్రత్యేక సేల్ నిర్వహిస్తోంది. ఈ సేల్‌లో భాగంగా అత్యంత ఖరీదైన ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌ను ఆకర్షణీయమైన ధరకు సొంతం చేసుకునే అవకాశం కల్పించింది. ఈ ఆఫర్ కింద, రూ. 1,49,900 విలువైన ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌ను కేవలం రూ. 1,02,900 ఎఫెక్టివ్ ధరకే కొనుగోలు చేయవచ్చు. ఇన్‌స్టంట్ డిస్కౌంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్డులపై లభించే క్యాష్‌బ్యాక్, పాత ఫోన్ ఎక్స్ఛేంజ్‌పై ఇచ్చే బోనస్ వంటివన్నీ కలిపి ఈ తగ్గింపును అందిస్తున్నట్లు ఇమేజిన్ స్టోర్ తెలిపింది. అయితే ఈ ఆఫర్లు పరిమిత కాలం పాటు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్‌తో పాటు, ఇతర ఉత్పత్తులపైనా ఆఫర్లు ఉన్నాయి. ఐఫోన్ 17 మోడల్ ఎఫెక్టివ్ ధర రూ. 52,900 నుంచి ప్రారంభమవుతోంది. అలాగే ఐప్యాడ్ (11వ జనరేషన్), యాపిల్ వాచ్ సిరీస్ 11 మోడళ్లపై కూడా ప్రత్యేక ధరలు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా పాత ఐఫోన్లను ఎక్స్ఛేంజ్ చేసేవారికి మెరుగైన విలువతో పాటు అదనపు బోనస్ కూడా లభిస్తుంది. గత ఏడాది సెప్టెంబర్‌లో విడుదలైన ఐఫోన్ 17 సిరీస్, శక్తిమంతమైన ఏ19 ప్రో చిప్‌సెట్, అత్యాధునిక కెమెరా సిస్టమ్‌తో వినియోగదారులను ఆకట్టుకుంటోంది. స్టాక్ ఉన్నంత వరకే ఈ ఆఫర్లు వర్తిస్తాయని, యాపిల్ ఉత్పత్తులను కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది గొప్ప అవకాశమని స్టోర్ పేర్కొంది.

# రేంజ్ రోవర్ లగ్జరీ కార్లపై భారీ డిస్కౌంట్.. కోటి రూపాయలకు పైగా తగ్గనున్న ధర




భారత్-యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ప్రభావంతో లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో తమ కార్ల ధరలను గణనీయంగా తగ్గించేందుకు సిద్ధమవుతోంది. ఈ నిర్ణయంతో కొన్ని టాప్-ఎండ్ రేంజ్ రోవర్ మోడళ్ల ధరలు ఏకంగా కోటి రూపాయలకు పైగా తగ్గే అవకాశం ఉంది. గతేడాది జులైలో భారత్, యూకే మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం ప్రకారం.. యూకే నుంచి పూర్తిస్థాయిలో తయారై దిగుమతి అయ్యే కార్లపై (సీబీయూ) దిగుమతి సుంకం మొదటి ఏడాదిలో 110 శాతం నుంచి 30 శాతానికి తగ్గనుంది. దీనివల్ల బాలీవుడ్ ప్రముఖులు అలియా భట్, రణ్‌వీర్ సింగ్, సోనమ్ కపూర్ వంటి వారు ఎక్కువగా ఇష్టపడే రేంజ్ రోవర్ ఆటోబయోగ్రఫీ, ఎస్‌వీ ఎడిషన్ల వంటి హై-ఎండ్ వేరియంట్ల ధరలు భారీగా తగ్గనున్నాయి. నివేదికల ప్రకారం ఈ కార్ల ధరలు 13 నుంచి 25 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. ఉదాహరణకు ప్రస్తుతం రూ. 2.75 కోట్లుగా ఉన్న రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎస్‌వీ ఎడిషన్ టూ ధర రూ. 2.35 కోట్లకు చేరవచ్చు. అదేవిధంగా రూ. 4.25 కోట్ల విలువైన రేంజ్ రోవర్ 4.4-లీటర్ పెట్రోల్ ఎస్‌వీ మోడల్ ధర రూ. 3.19 కోట్లకు దిగిరావచ్చని అంచనా.

**దేశీయంగా అసెంబుల్ చేసే మోడళ్లకు ఈ తగ్గింపు వర్తించదు**

అయితే, ఈ ధరల తగ్గింపు కేవలం యూకే నుంచి దిగుమతి చేసుకునే ఎస్‌వీ మోడళ్లకు మాత్రమే వర్తిస్తుంది. పూణెలోని ప్లాంట్‌లో విడిభాగాలను (సీకేడీ) తెచ్చి అసెంబుల్ చేసే రేంజ్ రోవర్, రేంజ్ రోవర్ స్పోర్ట్, వెలార్, డిస్కవరీ స్పోర్ట్ వంటి మోడళ్లపై ఈ ప్రభావం ఉండదు. అలాగే, స్లోవేకియాలో తయారయ్యే డిఫెండర్ మోడల్ ధరలో కూడా మార్పు ఉండదు. ప్రస్తుతం భారత లగ్జరీ కార్ల మార్కెట్‌లో 25 శాతం వాటాను కలిగి ఉన్న జేఎల్ఆర్.. ఈ ధరల తగ్గింపుతో మెర్సిడెస్, బీఎండబ్ల్యూ వంటి ప్రత్యర్థి సంస్థలపై పోటీలో మరింత పట్టు సాధించనుంది.

## దూసుకెళ్తున్న ఎయిర్‌టెల్.. వెనుకబడే వున్న వొడాఫోన్ ఐడియా




భారత టెలికం రంగంలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. భారతీ ఎయిర్‌టెల్ తన సబ్‌స్క్రైబర్ల సంఖ్యను నిలకడగా పెంచుకుంటూ దూసుకెళ్తుండగా, తీవ్ర నష్టాల్లో ఉన్న వొడాఫోన్ ఐడియాకు కాస్త ఊరట లభించింది. రిలయన్స్ జియో మాత్రం అగ్రస్థానంలో ఎలాంటి మార్పు లేకుండా కొనసాగుతోంది. గత కొన్ని నెలలుగా భారతీ ఎయిర్‌టెల్ నిలకడైన వృద్ధిని ప్రదర్శిస్తోంది. మెషిన్-టు-మెషిన్ కనెక్షన్లతో పాటు, వాటిని మినహాయించి కూడా ఎయిర్‌టెల్ నికరంగా వినియోగదారులను పెంచుకుంటూ వస్తుండటం గమనార్హం. విస్తృతమైన సేవలతో కొత్త కస్టమర్లను ఆకట్టుకోవడంలో సంస్థ సఫలమవుతోంది. మరోవైపు, తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వొడాఫోన్ ఐడియాకు ఊరటనిచ్చే వార్త వెలువడింది. గత జూలై తర్వాత తొలిసారిగా ఫిబ్రవరి నెలలో ఈ సంస్థ నికరంగా 22,000 మంది కొత్త సబ్‌స్క్రైబర్లను సంపాదించుకుంది. వినియోగదారుల తగ్గుదలను అరికట్టేందుకు సంస్థ అమలు చేస్తున్న వ్యూహాలు స్వల్పంగానైనా ఫలితాల నిస్తున్నాయని ఇది సూచిస్తోంది. ఇక దేశంలోనే అతిపెద్ద టెలికం సంస్థగా రిలయన్స్ జియో తన స్థానాన్ని పదిలంగా ఉంచుకుంది. అయితే, ఇప్పటికే భారీ సంఖ్యలో ఖాతాదారులు ఉండటం వల్ల (బేస్ ఎఫెక్ట్) కొత్తగా చేరే వారి సంఖ్య వృద్ధి పరంగా తక్కువగా కనిపిస్తోంది. మొత్తం మీద టెలికం మార్కెట్‌లో పోటీ తీవ్రంగా కొనసాగుతుండగా, మార్కెట్ వాటా విషయంలో వొడాఫోన్ ఐడియా ఇంకా వెనుకబడే ఉంది.


# సన్‌రైజర్స్ కెప్టెన్సీపై చర్చ.. నాకు కూడా ఇలాగే జరిగిందంటూ ధోనీ విషయాన్ని గుర్తు చేసిన యువీ





ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అందుబాటులో లేకపోవడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్టు తాత్కాలిక కెప్టెన్‌గా ఇషాన్ కిషన్‌ను నియమించింది. ఈ నిర్ణయం క్రీడా వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. చాలాకాలంగా జట్టుతో కొనసాగుతున్న యువ ఆల్‌రౌండర్ అభిషేక్ శర్మకు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తారని అందరూ భావించినప్పటికీ, ఫ్రాంచైజీ యాజమాన్యం ఇషాన్ వైపు మొగ్గు చూపింది. ఈ నిర్ణయం పట్ల టీమిండియా మాజీ దిగ్గజం యువరాజ్ సింగ్ తన అసంతృప్తిని, నిరాశను బహిరంగంగా వ్యక్తం చేశాడు. అభిషేక్ శర్మకు కొన్నేళ్లుగా నెట్స్‌లో శిక్షణ ఇస్తున్న యువరాజ్ సింగ్, అతడిని కెప్టెన్‌గా ఎంపిక చేయకపోవడం సరైంది కాదన్నాడు. స్పోర్ట్స్ తక్‌తో యువీ మాట్లాడుతూ... "ఈ నిర్ణయం నన్ను కాస్త నిరాశపరిచింది. ఇషాన్ కిషన్ ఎదుగుదల అంటే నాకూ ఇష్టమే. కానీ, ఒక ఆటగాడి కోణంలో ఆలోచించండి. అభిషేక్ శర్మ ఏడేళ్లుగా ఒకే ఫ్రాంచైజీకి తన సర్వస్వాన్ని అందిస్తున్నాడు. తన రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఉంటూ, ఆ జట్టును గెలిపించాడు. అలాంటి ఆటగాడికి నాయకత్వ బాధ్యతలు ఇవ్వకపోతే, అతను ఎలాంటి మానసిక స్థితితో ఆడతాడు?" అని యువరాజ్ ప్రశ్నించాడు. అయితే, ఇషాన్, అభిషేక్ మధ్య మంచి స్నేహం ఉండటం ఈ ఎదురుదెబ్బ నుంచి కోలుకోవడానికి సహాయపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా యువరాజ్ తన కెరీర్‌లోని ఒక సంఘటనను గుర్తుచేసుకున్నారు. "2007లో భారత జట్టులో నేను వైస్-కెప్టెన్‌గా ఉన్నాను. సెహ్వాగ్, హర్భజన్ సింగ్ వంటి సీనియర్లు ఉన్నారు. కానీ, ఎక్కడి నుంచో వచ్చి ఎంఎస్ ధోనీ కెప్టెన్ అయ్యాడు. దానికి కారణాలు ఏవైనా కావచ్చు. కొందరి తలరాతలో నాయకుడిగా ఎదగాలని రాసిపెట్టి ఉంటుంది. కానీ, ఏళ్ల తరబడి జట్టు కోసం కష్టపడిన వారికి అవకాశం రానప్పుడు ఆటగాడిగా నిరాశ కలగడం సహజం" అని వివరించాడు. ఫ్రాంచైజీ నిర్ణయంతో తాను ఏకీభవించలేనని, అయితే ఇప్పుడు నిర్ణయం జరిగిపోయిందని యువరాజ్ అన్నాడు. "రేపు హైదరాబాద్ గెలిస్తే నా మాటలు తప్పని నిరూపితం కావచ్చు. కానీ, నా అభిప్రాయం ప్రకారం వారి బౌలింగ్ చాలా బలహీనంగా ఉంది. నాయకుడిగా ఎదిగేందుకు ఐపీఎల్ గొప్ప వేదిక. అభిషేక్‌కు ఆ అవకాశం ఇచ్చి ఉండాల్సింది. ఏదేమైనా ఈ నిరాశను పక్కనపెట్టి, కెప్టెన్‌కు మద్దతు ఇస్తూ, జరిగిన అవమానాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత కష్టపడి ఆడాలని అభిషేక్‌కు చెప్పాను" అని యువీ చెప్పుకొచ్చాడు.

## రెండుసార్లు ఓడినంత మాత్రాన ప్రపంచమేమీ అంతం కాదు: రహానే



ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఘోర ఓటమి తర్వాత, కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కెప్టెన్ అజింక్య రహానే జట్టు సభ్యులలో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేశాడు. వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిపోయినంత మాత్రాన ప్రపంచం ఏమీ అంతం కాదని, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని ఆటగాళ్లకు ధైర్యం చెప్పాడు. గురువారం ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ 65 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైంది. మ్యాచ్ అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లను ఉద్దేశించి రహానే మాట్లాడాడు. ఈ గేమ్‌లో ఎన్నో సానుకూల అంశాలు ఉన్నాయని, ముఖ్యంగా పది ఓవర్ల తర్వాత బౌలర్లు అద్భుతంగా పుంజుకుని సన్‌రైజర్స్ బ్యాటర్లను కట్టడి చేసిన తీరు అద్భుతమని ప్రశంసించాడు. కేకేఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో విడుదల చేసిన వీడియోలో రహానే ఈ వ్యాఖ్యలు చేశాడు. "డ్రెస్సింగ్ రూమ్‌లో మనం ప్రతిరోజూ ఏం ఆలోచిస్తామనేదే నాకు ముఖ్యం. మన ఆటగాళ్ల ప్రయత్నం ప్రశంసనీయం. మీలో ప్రతి ఒక్కరూ మ్యాచ్ విన్నర్లే. ఏ పరిస్థితిలోనైనా జట్టును గెలిపించగల సత్తా మీకుంది. ఆ నమ్మకాన్ని కోల్పోవద్దు" అని రహానే పేర్కొన్నాడు. భారీ లక్ష్య ఛేదనలో తొలి బంతి నుంచే బ్యాటర్లు చూపిన పోరాట పటిమను కూడా కెప్టెన్ మెచ్చుకున్నాడు. "ప్రపంచం మన గురించి ఏమనుకున్నా పట్టించుకోవద్దు. మనపై మనకు నమ్మకం ఉంటే చాలు" అని రహానే స్పష్టం చేశాడు. కాగా, కేకేఆర్ చరిత్రలో ఒక సీజన్‌ను వరుసగా రెండు ఓటములతో ప్రారంభించడం ఇది కేవలం రెండోసారి మాత్రమే. కేకేఆర్ తన తర్వాతి మ్యాచ్‌లను ఏప్రిల్ 6న పంజాబ్ కింగ్స్‌తో, ఏప్రిల్ 9న లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆడనుంది.

## స్పోర్ట్స్

### పాక్‌లో పెట్రోల్ ధరల భారం... ప్రభుత్వానికి అండగా నిలవాలన్న షాహిద్ అఫ్రిది





పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభానికి దారితీసింది. దీని ప్రభావంతో భారత్ పొరుగు దేశం పాకిస్థాన్‌లో పెట్రోల్ ధరలు ఆకాశాన్నంటాయి. లీటర్ పెట్రోల్ ధర ఏకంగా 458 పాకిస్థానీ రూపాయలకు చేరడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో మాజీ క్రికెట్ కెప్టెన్ షాహిద్ అఫ్రిది స్పందిస్తూ, జాతీయ ఐక్యతను ప్రదర్శించి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సంక్షోభంపై షాహిద్ అఫ్రిది ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "ప్రపంచం ఎదుర్కొంటున్న ఇంధన సంక్షోభంతో పోలిస్తే, పాకిస్థాన్ చాలా దేశాల కంటే మెరుగైన స్థితిలో ఉంది. ఈ సమయంలో ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం చాలా ముఖ్యం. పాకిస్థానీయులుగా, దేశ ప్రగతికి ఆటంకం కలగకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మనం పాటించాలి" అని ఆయన కోరారు. ప్రజలంతా సహనంతో ఉండి, ప్రభుత్వానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం పెంచిన ధరల ప్రకారం పెట్రోల్‌పై 42.7 శాతం, డీజిల్‌పై 54.9 శాతం మేర పెంపు నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగా కొత్త ధరలు శుక్రవారం నుంచి అమల్లోకి వస్తాయని, లీటర్ పెట్రోల్ ధర 458.40 రూపాయలుగా ఉంటుందని మంత్రి అలీ పర్వైజ్ మాలిక్ ప్రకటించారు.

## ధనుష్ సెట్‌లో చాలా నిశ్శబ్దంగా ఉంటాడు: సంయుక్త మీనన్



మలయాళ చిత్ర పరిశ్రమ నుండి వచ్చి, టాలీవుడ్‌లో వరుస విజయాలతో 'గోల్డెన్ లెగ్'గా గుర్తింపు తెచ్చుకున్న అందాల నటి సంయుక్త మీనన్. బింబిసార, విరూపాక్ష వంటి చిత్రాలతో తెలుగు పరిశ్రమలో ఆమె స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. పవర్ స్టార్ పవన్ చిత్రం 'భీమ్లా నాయక్'తో సంయుక్త రేంజ్ నెక్స్ట్ లెవెల్ కి వెళ్లింది. తమిళనాడులో కూడా సంయుక్తకు భారీ ఫాలోయింగ్ ఉంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ... ధనుష్ సరసన 'సార్' (తమిళంలో వాతి) చిత్రంలో నటించిన అనుభవాన్ని ఆమె పంచుకుంది. "ధనుష్ తో పనిచేయడం నాకు ఒక గొప్ప పాఠం లాంటిది. ఆయన సెట్‌లో చాలా నిశ్శబ్దంగా ఉంటారు. కానీ కెమెరా ముందుకు రాగానే అద్భుతమైన శక్తిని ప్రదర్శిస్తారు. ఆయన కథను ఎంచుకున్నారంటే అందులో కచ్చితంగా ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది" అని సంయుక్త ప్రశంసించింది. భవిష్యత్తులో మళ్ళీ ఆయనతో కలిసి నటించాలనే కోరికను ఆమె వ్యక్తం చేసింది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన 'సార్' చిత్రం విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ రూ. 100 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఇందులో మీనాక్షి అనే బోటనీ లెక్చరర్ పాత్రలో సంయుక్త ఒదిగిపోయింది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, కథాబల మున్న సినిమాలను ఎంచుకోవడమే తన విజయ రహస్యమని ఆమె స్పష్టం చేసింది.

# నా అహమే మా బంధానికి కారణం.. ఐశ్వర్యతో బంధం పై అభిషేక్



బాలీవుడ్ స్టార్ జంట అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్ బంధంపై ఎప్పటినుంచో రకరకాల ఊహాగానాలు వస్తూనే ఉన్నాయి. వీరిద్దరూ విడిపోతున్నారని, విడాకులు తీసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో తరచూ ప్రచారం జరుగుతుంటుంది. ఈ నేపథ్యంలో తన భార్య ఐశ్వర్యతో ఉన్న బంధం, కూతురు ఆరాధ్య పెంపకం గురించి అభిషేక్ బచ్చన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మనసు విప్పి మాట్లాడారు. ఐశ్వర్యతో తన విజయవంతమైన భాగస్వామ్యానికి తన అహమే కారణమని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. లిల్లీ సింగ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... "నా తల్లిదండ్రులు పెళ్లి చేసుకున్నప్పుడు, మా నాన్న కంటే మా అమ్మే పెద్ద స్టార్. అందుకే భార్య విజయవంతంగా ఉండటం నాకు కొత్తేమీ కాదు. మా బంధం ఎప్పుడూ ఒక భాగస్వామ్యం లాంటిదే. కెరీర్ ప్రారంభం నుంచే నాకు ఐశ్వర్య తెలుసు. మేం మొదట్లో మంచి స్నేహితులం మాత్రమే" అని గుర్తు చేసుకున్నారు. 'అహం' అనే పదాన్ని ఆయన నెగటివ్ అర్థంలో వాడలేదు. "నేను గెలవాలంటే నా భాగస్వామి పరుగు ఆపాల్సిన అవసరం లేదని నేను నమ్ముతాను. నా భర్తృత్వాన్ని నిరూపించుకోవడానికి నా భార్య తన పనిని ఆపేయాల్సిన అవసరం లేని బంధం నాకు కావాలి. అదృష్టవశాత్తు ఐశ్వర్య కూడా అలా ఆలోచించదు. అందుకే మా బంధానికి నా అహమే కారణం అన్నాను" అని అభిషేక్ వివరించారు. తన తండ్రి అమితాబ్ బచ్చన్ తనను లాంచ్ చేయలేదని, కానీ తర్వాత తన కోసం 'పా' చిత్రాన్ని నిర్మించారని గుర్తుచేశారు. తమ కుమార్తె ఆరాధ్య బచ్చన్ పెంపకం గురించి మాట్లాడుతూ, అభిషేక్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. "తల్లిదండ్రులలో తండ్రులు చాలా చెత్త టీచర్లు. ఎందుకంటే మా భావోద్వేగాలు అడ్డువస్తాయి. మహిళల్లో ఉండే సున్నితత్వం మాలో ఉండదు. మగవాళ్లు ఎక్కువగా చేతల ద్వారా తమను తాము నిరూపించుకోవాలనుకుంటారు" అని తెలిపారు. "మా ఇంట్లో, ఆరాధ్యకు మేమిద్దరం ఉత్తమ ఉదాహరణగా నిలవాలని ప్రయత్నిస్తాం. పిల్లలకు ఇది తప్పు, ఇది ఒప్పు అని చెప్పేకంటే, మన ప్రవర్తనతో వారికి ఆదర్శంగా నిలవాలి. తల్లిదండ్రులు నైతిక విలువలతో జీవించినప్పుడు, పిల్లలు కూడా వాటిని చూసి నేర్చుకుంటారు. ఆ విధంగానే వారిని భవిష్యత్తుకు సిద్ధం చేయాలి. మా ఇంట్లో ఎవరు మగాడు, ఎవరు ఆడ అనే పోటీ ఎప్పుడూ ఉండదు" అని ఆయన స్పష్టం చేశారు. కాగా, అభిషేక్, ఐశ్వర్య 2007 ఏప్రిల్ 20న వివాహం చేసుకున్నారు. ఈ ఏడాదితో వారి వైవాహిక బంధానికి 19 ఏళ్లు పూర్తి కానున్నాయి.

## యోధుడిగా సాయి దుర్గ తేజ్.. ఆసక్తి రేపుతున్న కొత్త సినిమా కాన్సెప్ట్ పోస్టర్




సుప్రీం హీరో, మెగా మేనల్లుడు సాయి దుర్గ తేజ్ తన కెరీర్‌లో 19వ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. చూణు19 అనే వర్కింగ్ టైటిల్‌తో రానున్న ఈ సినిమాకు సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం సోషల్ మీడియాలో విడుదల చేసింది. ఈ పోస్టర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది. యుగాల నాటి రహస్యాలు, ఊహకందని శక్తుల నేపథ్యంలో ఈ చిత్రం ఉండబోతోందని స్పష్టమవుతోంది. విడుదలైన పోస్టర్‌లో సాయి తేజ్ ఒక దట్టమైన అటవీ ప్రాంతంలో శక్తివంతమైన యోధుడిలా నిలబడి ఆకాశం వైపు చూస్తూ కనిపించారు. ఆకాశంలో వింత మేఘాలు, ఒక రహస్య పర్వతం, కాంతి పుంజాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. దీనికి 'యుగాల నాటి రహస్యాలు.. ఊహకు అందని అపరిమితమైన శక్తి' అనే క్యాప్షన్ జోడించడంతో ఇదొక మైథలాజికల్ టచ్ ఉన్న కాస్మిక్ అడ్వెంచర్ డ్రామా అని తెలుస్తోంది. ఇటీవల 'క' చిత్రంతో విజయం సాధించిన యువ దర్శకులు సుజీత్, సందీప్ ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాతో సాయి తేజ్ నిర్మాతగా కూడా మారుతుండటం విశేషం. తన తల్లి పేరు మీద 'విజయదుర్గ ప్రొడక్షన్స్' అనే బ్యానర్‌ను స్థాపించి, ఈ చిత్రానికి నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. త్వరలోనే నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను వెల్లడిస్తామని చిత్ర యూనిట్ తెలిపింది.

## 'రాకాస' ప్రీమియర్ షోలో మెగా హీరోల సందడి..





మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' బ్యానర్‌పై ఆమె నిర్మించిన రెండో చిత్రం 'రాకాస' ఇవాళ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మానస శర్మ దర్శకత్వం వహించిన ఈ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్‌లో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. విడుదలైన ఈ చిత్రం ప్రీమియర్ షోల నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంటోంది. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రీమియర్ షోకు మెగా కుటుంబ సభ్యులు హాజరై సందడి చేశారు. నిహారికకు మద్దతు తెలిపేందుకు వరుణ్ తేజ్-లావణ్య త్రిపాఠి దంపతులు, సాయి ధరమ్ తేజ్, సుస్మిత కొణిదెల, శ్రీజ కొణిదెల హాజరయ్యారు. ముఖ్యంగా సాయి ధరమ్ తేజ్ థియేటర్‌లో విజిల్స్ వేస్తూ తన ఉత్సాహాన్ని ప్రదర్శించడం అందరినీ ఆకట్టుకుంది. ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్ కూడా ఈ ప్రీమియర్‌కు హాజరై సినిమాను వీక్షించారు. అనంతరం ఆయన నిహారికను ప్రత్యేకంగా అభినందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కుటుంబ సభ్యులు, ప్రముఖుల ప్రశంసలతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. కామెడీ, ఫాంటసీ అంశాలతో 'రాకాస' ప్రేక్షకులను అలరిస్తుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## మగవాళ్లకు ఒక రూల్.. ఆడవాళ్లకు ఒక రూలా



ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్ బాబు తనయగా కాకుండా, నటిగా, నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న మంచు లక్ష్మి ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఇటీవల 'ఆదిపర్వం', 'దక్ష' చిత్రాలతో అలరించిన ఆమె, మార్చి చివరి వారంలో 'లేచింది మహిళా లోకం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, మన సమాజం మహిళలను చూసే దృక్పథంపై నిప్పులు చెరిగారు. సమాజం మహిళలను జడ్జ్ చేసే విధానాన్ని లక్ష్మి తప్పుబట్టారు. "మగవాళ్లు ఏదైనా బోల్డ్ నిర్ణయాలు తీసుకుంటే అది గొప్ప అని ప్రశంసిస్తారు. అదే ఆడవాళ్లు చేస్తే మాత్రం రకరకాలుగా మాట్లాడుకుంటారు. 'మేము చేస్తే సంసారం.. మీరు చేస్తే ఆ వ్యవహారం' అనే విధంగా ఉంటుంది. ఆ సామెతను నా నోటితో పూర్తిగా చెప్పను కానీ, మీకు అర్థమైందని అనుకుంటున్నాను" అని ఆమె చమత్కరిస్తూనే గట్టి కౌంటర్ ఇచ్చారు. ఆడవాళ్లు ఇలాగే ఉండాలి, ఇలాగే ప్రవర్తించాలి అని రూల్స్ రాసింది ఎవరని ఆమె ప్రశ్నించారు. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఒక ఆసక్తికర విషయాన్ని లక్ష్మి పంచుకున్నారు. "నా పెళ్లి సమయంలోనే నా భర్తకు ఒక మాట చెప్పాను. నువ్వు ఏ పని చేస్తావో.. అదే పని నేను కూడా చేయగలను అని గుర్తుంచుకోమన్నాను" అని తెలిపారు. తన మాటల ప్రభావమో ఏమో కానీ, తన భర్త ఏదైనా చేయడానికి జంకుతారని, తను చేస్తే లక్ష్మి కూడా చేస్తుందనే భయం ఆయన మనసులో ఉంటుందని ఆమె సరదాగా పేర్కొన్నారు

## కొండాపూర్ పబ్ పై పోలీసుల మెరుపు దాడి 8 మందికి డ్రగ్స్ పాజిటివ్..



నగరంలోని పబ్‌లలో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కొండాపూర్‌లోని 'క్వాక్ ఏరీనా పబ్'పై ఈగల్ టీమ్, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీలు పబ్‌లో ఉన్నవారందరినీ ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేశాయి. పబ్‌లో పార్టీ జరుగుతున్న సమయంలో ఎంట్రీ ఇచ్చిన పోలీసులు, అనుమానం ఉన్న సుమారు 64 మందికి అక్కడికక్కడే డ్రగ్స్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో మొత్తం 8 మందికి డ్రగ్స్ తీసుకున్నట్లు పాజిటివ్ అని తేలింది. వీరిలో ఆరుగురు గంజాయి సేవించగా, మరో ఇద్దరు ఇతర రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే నిందితులందరినీ అదుపులోకి తీసుకుని, తదుపరి విచారణ నిమిత్తం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ పార్టీలో టాలీవుడ్ సీనియర్ నటి హేమ కూడా పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. పబ్‌పై దాడి జరిగిన సమయంలో ఆమె అక్కడ ఉండటంతో రకరకాల ప్రచారాలు జరిగాయి. దీనిపై ఆమె తక్షణమే స్పందిస్తూ సోషల్ మీడియాలో ఒక వీడియోను విడుదల చేశారు. "నాకు నిర్వహించిన డ్రగ్స్ టెస్టులో నెగెటివ్ వచ్చింది. నేను ఏ తప్పూ చేయలేదు. దయచేసి నాపై అనవసరంగా దుష్ప్రచారం చేయవద్దు" అని ఆమె ఆ వీడియోలో స్పష్టం చేశారు. మరోవైపు, నగరంలోని పబ్‌ల యజమానులు నిబంధనలు అతిక్రమించినా, డ్రగ్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పబ్‌లలో సీసీ కెమెరాల నిఘాతో పాటు నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని వెల్లడించారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143